విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 97003 70499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 97003 70499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 16-07-2025 | సంపుటి : 11 | సంచిక : 166 | పేజీలు : 8 | వెల : రూ 3-00
కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# దేశానికి గేమ్ ఛేంజర్‌గా పివి ఆర్థిక సంస్కరణలు

**దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు భారత్ గతిని మార్చాయి**
**బహుభాషా వేత్తయే కాకుండా గొప్పరాజనీతిజ్ఞుడు**
**పివి కృషితోనే దేశంలో ఐటి విప్లవం సాధ్యమయ్యింది**
**పివి ఆర్థిక విధానాలపై చంద్రబాబు ప్రశంసలు**



న్యూఢిల్లీ,జూలై15(): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పివి తీసుకుని వచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజార్‌గా ఆర్థికరంగానికి ఊతంగా నిలిచాయని అన్నారు. దేశానికి అనేక రంగాల్లో పీవీ నరసింహారావు సేవలందించారు. ఆర్థిక సంస్కరణలు అంటే గుర్తొచ్చేది పివియేనని అన్నారు. లైసెన్స్‌రాజ్ నిబంధనల నుంచి దేశాన్ని బయటకు తెచ్చారు. 1990ల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. సరైన విధానాలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. ఆ సమయంలో పీవీ దూరదృష్టితో ఆర్థిక విధానాలను అమలు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక దేశ ఆర్థిక సంస్కరణలు కొత్తరూపు సంతరించుకుని గేమ్ ఛేంజర్‌గా మారాయి. పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం వచ్చిందని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పారు. 17 భాషలు నేర్చుకున్న పీవీ.. ప్రధాని, కేంద్రమంత్రి, సీఎంగా సేవలందించారని గుర్తుచేశారు. దిల్లీలో నిర్వహించిన లెక్చర్ సిరీస్ ఆరో ఎడిషన్ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ' అంశంపై ఆయన మాట్లాడారు. మైనారిటీ– ప్రభుత్వంలోనూ పీవీ చాలా లౌక్యంగా వ్యవహరించారు. పీవీ తెచ్చిన సంస్కరణలను వాజ్‌పేయీ కొనసాగించారు. వాజ్‌పేయీ హయాంలో హైవేలు, విమానాశ్రయాలు, పోర్టులు వచ్చాయి. 2014లో మోదీ ప్రధాని అయిన తర్వాత ఆయన కూడా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. మోదీ హయాంలో భారత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. అనేక దేశాలతో ఆయన మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్ పేరుతో ముందుకెళ్తున్నాం అని చంద్రబాబు అన్నారు. నేను చాలా అదృష్టవంతుడిని.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని చంద్రబాబు నాయుడు గుర్తుచేసుకున్నారు.. పీవీ భారత ముద్ద బిడ్డ, భారత రత్న.. అసలుసిసలు తెలుగు బిడ్డ అని కీర్తించారు.. ఆయనతో నాకు మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవని గుర్తుచేసుకున్నారు.. 17 భాషల్లో పీవీ నిష్ణాతుడు.. కానీ, ప్రస్తుతం హిందీ భాష నేర్చుకోవడం పై పెద్ద రాద్ధాంతం చేస్తున్నాం అని విమర్శించారు. ఎంతో సంయమనం, ఆలోచనపరమైన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు పీవీ అంటూ కొనియాడారు. గతంలో భారత ఆర్థికాభివృద్ధి రేటు– 3 నుంచి 5 శాతం ఉండేది.. గతంలో భారత దేశానికి చెందిన బంగారాన్ని తాకట్టు– పెట్టే పరిస్థితుల్లో ఉన్నాం..అనే వ్యత్యాసంతో చూడరాదు.. ఎలుకను పట్టుకునే పిల్లి అయితే చాలు అన్నారు చంద్రబాబు.. సంక్షోభాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలి. సరిగ్గా అదే చేశారు పీవీ నరసింహారావు అని తెలిపారు.. 1991లో దివంగత పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలను ఇప్పుడు దేశ ప్రజలంతా అనుభవిస్తున్నారు.. అన్ని పార్టీల మధ్య రాజకీయ ఏకాభిప్రాయం సాధించడంలో అసాధారణ ప్రతిభాశాలి పీవీ అంటూ ప్రశంసలు కురిపించారు చంద్రబాబు. 2014లో ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా భారత్ ఉంది.. 2028 కల్లా భారత్ మూడవ ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామన్న విశ్వాసం నాకు ఉందన్నారు చంద్రబాబు.. 2047 కల్లా భారత్ ప్రపంచంలోనే నెంబర్ 1 ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు.. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ప్రారంభించారు.. అప్పట్లో 3 నుంచి 4 వరకు భారత్ ఆర్థికాభివృద్ధి రేటు ఉండేది.. ప్రస్తుతం భారత్ ఆర్థికాభివృద్ధి రేటు– 6 నుంచి 7 వరకు ఉంది. 2047 కల్లా భారత్ వృద్ధి రేటు– 10కి మించి ఉంటుందనే నమ్మకాన్ని చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారు.

## భూమికి దిగిన శుభాంశు శుక్లా.. ప్రధాని మోదీ రియాక్షన్



న్యూఢిల్లీ, జులై 15: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా భూమిపైకి చేరుకున్న శుభాంశు శుక్లా బృందానికి ప్రధాని మోదీ స్వాగతం పలికారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామి శుక్లా అని ఆయన పేర్కొన్నారు. కోట్లాది మందికి ఆయన అంకితభావం, ధైర్యం, స్ఫూర్తి ప్రేరణ అందిస్తుందన్నారు. గగన్‌యాన్‌కు ఈ యాత్ర మరో మైలురాయి అవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు.గత నెల జూన్ 25వ తేదీన ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ యుజాన్‌స్కీ విష్నేవ్‌స్కీ,టైబోర్ కపుతో కలిసి శుభాంశు శుక్లా.. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్–9 రాకెట్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమయ్యారు. అమెరికాలోని ఫ్లోరిడాలో నాసా కెన్నడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.ఇక గతంలో శుభాంశు శుక్లా చేయవలసిన ఈ అంతరిక్ష యాత్ర పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే.

# దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సవరణ

**పలు సూచనలు చేస్తూ టిడిపి వినతిపత్రం**
**ఢిల్లీలో ఇసిని కలిసిన పార్టీ నేతలు**




న్యూఢిల్లీ,జూలై15: సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్‌లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు – జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగనుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని పార్టీ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపోహలకు చోటులేకుండా సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో దేశ వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించనున్న నేపథ్యంలో సీఈసీకి తెలుగుదేశం పార్టీ 7 సూచనలు చేసింది. దిల్లీలో సీఈసీని కలిసిన తెదేపా నేతల బృం దం ఈమేరకు పార్టీ తరఫున వినతి పత్రం అందించింది. ఎస్ఐఆ ర్‌ను ఏపీలో అమలు చేసేటప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, ధ్రువ పత్రాల విషయంతో పాటు– ఓట్ల తొలగింపుపై ప్రజల్లో నెలకొన్న అపోహలపై సందేహాలను లేవనెత్తింది. ఎస్ఐఆర్ వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని, ఎవరి ఓట్లు– తొలగించబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెదేపా నేతలు తెలిపారు. తెదేపా ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు, కూన రవికుమార్ తదితరులు సీఈసీని కలిసిన వారిలో ఉన్నారు.

# జగ్గంపేటలో మంత్రి పి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఇంటింటా ప్రచారం

**ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం మాది**
**రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్**

కాకినాడ(విజయ సారథి):జగ్గంపేటలోకూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ నేతృత్వంలో నిర్వహించిన సుపరిపాలన తొలి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం అభివృద్ధిని వివరిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ డోర్ టు డోర్ తిరిగారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారానే మెరుగైన పాలన సాధ్యమని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పదంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని సీఎం చంద్రబాబు అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని మంత్రి నారాయణపేర్కొన్నారు. జగ్గంపేట శెట్టిబలిజిపేటలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను, ఏడాది



పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్నారని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెహ్రూ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ లు అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, ఉంగరాల రాము, రాష్ట్ర టిడిపి కార్యదర్శులు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్య దొర, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న చర్యలు తీసుకుంటున్నాం

**ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేలా నిమ్స్ స్థాయికి... విమ్స్ ను తీసుకెళ్తాం**
**వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీలో డిప్లొమా, క్లినికల్ సైకాలజీలో ఎం.ఫిల్ కోర్సులు ప్రవేశపెడతాం**
**విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభోత్సవాల్లో మంత్రి సత్యకుమార్**
**మానసిక వైద్యశాలలో రూ.29.70 కోట్లతో ఆధునిక భవనాలు, పెదవాల్తేర్లో రూ.1.38 కోట్లతో యూపీహెచ్సీ**
**ప్రారంభోత్సవాల్లో భాగస్వామ్యమైన ఎంపీ, ఎమ్మెల్సీ, తూర్పు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్**






విశాఖపట్టణం(విజయ సారథి):రాష్ట్రంలో వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న రీతిలో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నిమ్స్ స్థాయికి.. విమ్స్ ను తీసుకెళ్తామని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. దీర్ఘకాలిక లక్ష్యాలు, అవసరాల దృష్ట్యా వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీ విభాగంలో ఎమ్మెస్సీ లేదా డిప్లొమో, క్లినికల్ సైకాలజీలో 30 సీట్లతో కూడిన ఎం.ఫిల్ కోర్సులు ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య అవసరాలు తీరుస్తున్న విశాఖపట్టణంలోని మెంటల్ ఆసుపత్రి పేరు మార్పుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మెంటల్ కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.29.70 కోట్లతో నిర్మించిన భవనాలను, పోలమాంబ గుడి సమీపంలో భానోజీనగర్ లో రూ.1.38 కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(యూపీహెచ్సీ)లను మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు.అభివృద్ధికి నిధులు కాదు... ఆశ, ఆశయం ఉండాలి..కార్యక్రమంలో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పలు అంశాలపై మాట్లాడారు. "అభివృద్ధి చేయాలంటే నిధులు కాదు.. ఆశ, ఆశయం ఉండాలి. గత ఏడు సంవత్సారాల నుంచి విశాఖలోని ఈ భవనాలపై తాత్సారం జరిగింది. డబ్బులుండి కూడా పనులు పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు సంకల్పంతో అందుబాటులోకి తీసుకొస్తున్నాం. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు సమకూర్చి ఆధునిక వసతులతో కూడిన భవనాలను నిర్మించగలిగాం. ఈ రోజు ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం.సంతృప్తిగా ఉంది. ఇది చాలా ప్రతిష్టాత్మకమైన ఆసుపత్రి. మన రాష్ట్రం వాళ్లే కాకుండా ఒడిశా, ఛత్తీస్ ఘడ్ నుంచి కూడా వస్తున్నారు. ఈ రోజు దేశంలో 15 కోట్ల మంది మానసిక పరమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వారిలో 80 శాతం మందికి రోగమేంటో తెలియదు. రాష్ట్రంలో చాలా పరిమితి సంఖ్యలో మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఈ పరిస్థితి మారాల్సి ఉంది. దేశంలో 25,000 మంది సైకియాట్రిస్టులు మాత్రమే ఉన్నారు. 50వేల మందికి పెరగాల్సిన అవసరం ఉంది. లక్ష మందికి ముగ్గురు సైకియాట్రిస్టులు ఉండాల్సి ఉండగా. 0.7 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీన్ని అధిగమించేందుకు యువత మానసిక కోర్సులను ఎంపిక చేసుకోవాలి. మరింత మంది ఈ రంగంలోకి రావాల్సి ఉంది. మానసిక పరమైన వ్యాధిగ్రస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కించపరకూడదు. శ్రీశ్రీ సమాజంలోని సమస్యలను, బాధలను తనవిగా భావించి రచనలు చేసేవారు. అలాగే మానసిక వైద్య నిపుణులు కూడా సేవలందిస్తున్నారు. వారంతా శ్రీశ్రీ వంటి వారు అని మంత్రి అభివర్ణించారు.""మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు గాను భవిత కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురాకూడదు. ఈ మధ్య కోస్టల్ తీరంలో జరిగిన కొన్ని సర్వేలను పరిశీలించినట్లయితే... 14.5 శాతం బాలింతలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఆ సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో 19 శాతం, గిరిజన ప్రాంతాల్లో 21 శాతం ఉంది. 2020–21 గణంకాల ప్రకారం అనేక కారణాలతో 8,062 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గత ఏడాది ఈ పరిస్థితి 48 శాతం పెరిగింది. వారిలో 34 శాతం మంది దీర్ఘకాలిక వ్యాధుల వల్ల చనిపోతే. 7 శాతం కేవలం మానసికమైన సమస్యల వల్లే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందులో ప్రధాన భాగం యువతే ఉండటం విచారకరం. రోగమంటే శారీరకమైనది మాత్రమే కాదు. మానసికమైనది కూడా. అలాంటి మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు, సేవ చేసేందుకు వైద్యులు ముందుకు రావటం అభినందనీయం. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల సాయంతో కూడిన కౌన్సెలింగ్ ప్రక్రియల ద్వారా ఈ పరిస్థితిని మార్చాల్సి ఉంది" అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మెంటల్ ఆసుపత్రి (మిగతా 8లో )

# గోదావరి-బనకచర్లపై చర్చ అనుచితం: తెలంగాణ సర్కార్

హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం కోసం కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే రేపటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది.పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. 200 టిఎ?ంసిల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించింది.

# సంపాదకీయం

బుధవారం 16-07-2025

## భారత్‌కు బిగ్ బూస్ట్,

భారత్ అంటేనే పుష్కలమైన సహజ వనరులకు కేరాఫ్ అడ్రస్. ఆంగ్లేయులు మన వనరులను కొల్లగొట్టినా.. కోట్లాది మంది భారతీయులకు ఈ పుణ్యభూమి తన సంపదను పంచుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలకు, ఖనిజ వనరులకు విపరీతమైన డిమాండ్ నెలకొన్న వేళ.. భారత్‌కు బూస్టినిచ్చే వార్తను శాస్త్రవేత్తలు అందించారు. ఈశాన్య రాష్ట్రాల్లో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. వాటిని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ ఖనిజ సంపదను వెలికితీస్తే, దేశ అవసరాలకు సరిపోయేంత ఉంచుకుని, మిగిలినవి విదేశాలకు ఎగుమతి చేసుకోవడం ద్వారా.. ఆదాయం పొందే, అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆత్మనిర్భర్ భారత్ కింద.. దేశానికి కావాల్సిన వస్తువులు, ఉత్పత్తులను మనమే తయారుచేసుకునే ప్రక్రియకు ఇది మరింత ఊతమిస్తుంది.140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్ లాంటి దేశాలకు.. ఏ వస్తువైనా భారీగానే డిమాండ్ ఉంటుంది. మన లాంటి దేశాలు.. ఇతర దేశాల నుంచి ఎన్ని వస్తువులను దిగుమతి చేసుకున్నా.. ఇంకా అవసరం పడుతూనే ఉంటాయి. దేశ జనాభా అవసరాలు తీరాలంటే దిగుమతులూ భారీగా ఉండాల్సిందే. ఇలాంటి తరుణంలో ఈశాన్య ప్రాంతం వ్యూహాత్మక, కీలకమైన ఖనిజ వనరులకు ఒక కొత్త కేంద్రంగా ఉద్భవించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రక్షణ తయారీ రంగాలకు అత్యవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (భూమిలోని అరుదైన మూలకాలు), గ్రాఫైట్, వెనాడియం, లిథియం, కోబాల్ట్ లాంటి ఖనిజాలు ఈశాన్య ప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయని.. జీఎస్ఐ నిర్వహించిన అధ్యయనాలు, అన్వేషణలు చెబుతున్నాయి.ప్రపంచంలోనే రేర్ ఎర్త్ మాగ్నెట్స్ (భూమిలోని అరుదైన మూలకాల)కు ప్రధాన ఎగుమతిదారుగా ప్రస్తుతం చైనా ఉంది. భూమిలోని అరుదైన మూలకాలు, తయారైన మూలకాల ఎగుమతులపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా ఆంక్షలు విధించింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఈ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అత్యంత కీలకం. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 540 టన్నుల మాగ్నెట్ దిగుమతి చేసుకోగా.. అందులో 80 శాతానికి పైగా చైనా నుంచి దిగుమతి చేసుకుంది. యూరోపియన్ క్లీన్ ఎనర్జీ రంగం కూడా తన రేర్ ఎర్త్ మాగ్నెట్స్ అవసరాల్లో దాదాపు 98 శాతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటుంది. చైనా విధించిన ఆంక్షలతో పశ్చిమ దేశాలతో పాటు భారత్‌లోనూ తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై స్పందించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్.. భారత్ రేర్ ఎర్త్ మాగ్నెట్స్ కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, ఇతర సప్లై చైన్ వెతికేందుకు ఒక మేల్కొలుపు లాంటిదని గత నెలలో కీలక వ్యాఖ్యలు చేశారు.దేశీయంగా పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో.. చైనా ఆంక్షలు.. మన దేశంలోనే వనరులను వెలికితీసే ప్రక్రియ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేశాయి. అలాంటి వనరుల కోసం భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఈశాన్య ప్రాంతంలో ఉన్న అరుదైన ఖనిజ సంపదకు సంబంధించి.. జీఎస్ఐ 57 పేజీల నివేదికలో వెల్లడించడం గమనార్హం. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నిధులతో ఈశాన్య ప్రాంతంలో ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు జరుగుతున్నాయి.భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలపైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు.. 2.62 లక్షల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇది దేశం మొత్తం భౌగోళిక ప్రాంతంలో 8 శాతం. ఈశాన్య ప్రాంతం ప్రత్యేకమైన భూగర్భ నిర్మాణాన్ని కలిగి ఉండి.. ఒఫియోలైట్ బెల్టులు, ఆల్కలైన్-అల్ట్రామాఫిక్ కాంప్లెక్స్‌లు, గ్రాఫైట్-బేరింగ్ స్కిస్టులతో కూడినవని.. అనేక ముఖ్యమైన ఖనిజాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని జీఎస్ఐ పేర్కొంది. టెక్నాలజీ అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ వైపు భారత్ సిద్ధమవుతున్న తరుణంలో.. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ వనరులు కీలక పాత్ర పోషించనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.మన దేశంలో సహజ ఫ్లేక్ గ్రాఫైట్‌కు అత్యంత ముఖ్యమైన దేశీయ వనరుగా అరుణాచల్ ప్రదేశ్ అవతరించింది. వెస్ట్ సియాంగ్, పాపుమ్ పారే, లోయర్ సుబన్సిరి జిల్లాల్లో గ్రాఫైట్ ప్రధాన నిక్షేపాలను గుర్తించారు. అక్కడ 17.89 మిలియన్ టన్నులకు పైగా గ్రాఫైట్ వనరులు ఉన్నాయని జీఎస్ఐ అంచనా వేసింది. ఈ ప్రాంతంలోని గ్రాఫైట్ సాధారణంగా 5 శాతం నుంచి 25 శాతం వరకు స్థిర కార్బన్ కంటెంట్‌తో కూడిన సన్నని మధ్యస్థ ఫ్లేక్‌లను కలిగి ఉంటుందని తెలిపింది. ఇది లిథియం-అయాన్ బ్యాటరీ అనోడ్‌ల వంటి వాటికి అనుకూలమైన ముడి పదార్థంగా చేస్తుందని పేర్కొంది. ఇక అరుణాచల్ ప్రదేశ్‌లోనే మరో ప్రధాన ఖనిజం వెనాడియంను గుర్తించారు. స్టీల్ మిశ్రమాలు, ఇతర పారిశ్రామిక అవసరాల్లో ఈ వెనాడియంను ఉపయోగిస్తారు. 13.79 మిలియన్ టన్నుల వెనాడియం ఉంటుందని అంచనా వేస్తున్నారు.అస్సాం, మేఘాలయ రాష్ట్రాల్లో జీఎస్ఐ చేసిన పరిశోధనల్లో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు తెలిసింది. అస్సాంలో వెయ్యి నుంచి 5 వేల పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) గాఢతతో భూమిలోని అరుదైన మూలకాలు ఉన్నట్లు జీఎస్ఐ కనుగొంది. మేఘాలయలో 3,646 నుంచి 5,100 పీపీఎం మధ్య భూమిలోని అరుదైన మూలకాలు విలువలను చూపించాయని పేర్కొంది.అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో లిథియం నిక్షేపాల సూచనలు ఉన్నాయని జీఎస్ఐ నివేదిక వెల్లడించింది. అయితే వీటి అన్వేషణ ఇంకా ప్రారంభ దశల్లోనే ఉన్నప్పటికీ.. మన దేశం లిథియం కోసం దిగుమతులపైనే భారీగా ఆధారపడటాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. వీటికి సంబంధించి మరింత అన్వేషణ చేయాల్సిందే.

# తాట తీస్తున్న ఈగల్ టీమ్...

హైదరాబాద్, జూలై 15, వ్యసనం అనేది ఏడూళ్ల ప్రయాణం లాంటిదని వెనకటికి పెద్దలు చెప్పేవారు. అది ఎంత నిజమో మరోసారి తేలింది. భాయ్ బచ్చ ఆగయా అని పోలీసులు మెసేజ్ చేయడమే ఆలస్యం.. 14 మంది దాకా వచ్చారు. వారిలో ఐటీ ఉద్యోగులు ఉన్నారు. విద్యార్థులు ఉన్నారు. ప్రాపర్టీ మేనేజర్లు కూడా ఉన్నారు. వీరందరిలో నాలుగు సంవత్సరాల కొడుకు ఉన్న జంట కూడా వచ్చింది. వీరంతా వచ్చింది వారి కేసుల పరిష్కారానికో.. ఇంకోదానికో కాదు.. సమాజం అత్యంత హేయంగా భావించే ఓ పదార్థం కోసం.. అలా పదార్థం కోసం వచ్చి చిక్కిపోయారు. పోలీసుల చేతిలో అడ్డంగా బుక్కయ్యారు..తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్థాల కట్టడికి ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అక్రమాలు.. ఆక్రమణలు.. అతిక్రమణలు జరగకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చింది. ఆక్రమణలకు గురైన చెరువులకు జీవం పోస్తోంది. ఇదే క్రమంలో మత్తు పదార్థాలకు బానిసలై తెలంగాణ ప్రజలు ఆగం కావద్దు అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ అనే వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చారు. ఈగల్ అనేది తెలంగాణ పోలీసింగ్లో ఒక ప్రత్యేకమైన విభాగం. ఈ విభాగం మఫ్టీ లో పనిచేస్తుంది. మామూలుగా అయితే హైదరాబాద్ నగరంలో పబ్ లు, క్లబ్ లు, రెస్టారెంట్లపై పోలీసులు తరచూ దాడులు చేస్తుంటారు. మత్తు పదార్థాలు స్వీకరించే వారిపై నిఘా పెడతారు. వారికి పరీక్షలు నిర్వహించి అదుపులోకి తీసుకుంటారు. ఆ తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి డి అడిక్షన్ సెంటర్ కు పంపిస్తారు. మత్తు పదార్థాలు తీసుకున్నారని సమాచారం అందినప్పుడు మాత్రమే పోలీసులు రంగంలోకి దిగుతారు. అయితే రేవంత్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈగల్ అనే వ్యవస్థ ఇందుకు పూర్తి భిన్నమైనది. మత్తు పదార్థాల మూలాలను దెబ్బ కొట్టడానికి ఈ వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆశయాల మేరకు ఈ విభాగం పని చేస్తోంది. ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపుతోంది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నది. విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం సేకరించి.. మత్తు పదార్థాల మూలాలను పెకిలించే ప్రయత్నం చేస్తున్నది. అందువల్లే హైదరాబాదులో మత్తు పదార్థాలు ఒక పట్లగా ఇప్పుడు లభ్యం కావడం లేదు. మత్తు పదార్థాల రాకను ప్రభుత్వం తొక్కి పెట్టిన నేపథ్యంలో.. వేరే మార్గాల వైపు అక్రమార్కులు చూస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ ప్రయత్నాలను కూడా తొక్కి పెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.హైదరాబాద్ నగరంలో భిన్న వర్గాల ప్రజలు ఉంటారు. భిన్న వ్యాపారాలు కూడా సాగుతుంటాయి. అయితే కొంతమంది తాత్కాలిక ఆనందం కోసం.. విపరీతమైన మత్తు కోసం చట్ట విరుద్ధమైన పదార్థాలను స్వీకరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఈగల్ అనే వ్యవస్థను తెరపైకి తీసుకురావడం వల్ల వీరికి మత్తు పదార్థాల రాక ఆగిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నవారికి పోలీసులు మరోసారి షాక్ ఇచ్చారు. హైదరాబాదులో మత్తు పదార్థాల వినియోగదారులను పక్కా స్కెచ్ తో ఈగల్ సభ్యులు పట్టుకున్నారు. ఇటీవల ఈగల్ సభ్యులు నిర్వహించిన ఓ ఆపరేషన్లో సందీప్ అనే మత్తు పదార్థాల డీలర్ అరెస్ట్ అయ్యాడు. అతని ఫోన్లో ఉన్న 100 మందికి పోలీసులు భాయ్ బచ్చ ఆగయా అనే పేరుతో మెసేజ్ చేశారు. దీంతో రెండు గంటల్లో 14 మంది పోలీసులు చెప్పిన లొకేషన్ కు వచ్చారు. ఇందులో భిన్న వర్గాల ప్రజలు ఉన్నారు. ఓ జంట తమ నాలుగు సంవత్సరాల కుమారుడితో పోలీసులు చెప్పిన లొకేషన్ కు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. పోలీసులు నిర్వహించిన పరీక్షలలో వారందరూ మత్తు పదార్థాలు తీసుకున్నట్టు తేలింది. దీంతో వారందరినీ డి అడిక్షన్ సెంటర్ కు తరలించారు. ఇటీవల ఈగల్ ప్రత్యేకమైన ఆపరేషన్ చేపట్టింది. ఇందులో సందీప్ అనే డీలర్ దొరికిపోయాడు. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించడం మొదలుపెట్టారు. తద్వారా అతడు చెప్పిన వివరాల ఆధారంగా మత్తు పదార్థాలు విక్రయించే వ్యక్తులపైన ఉక్కు పాదం మోపుతున్నారు. అంతేకాదు మత్తు పదార్థాలు కొనుగోలు చేసే వారిపై కూడా కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. దీంతో ఈగల్ అంటే హడల్ ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్ తీసుకువచ్చిన ఈ వ్యవస్థ పట్ల ప్రజలకు సదాభిప్రాయం కలుగుతోంది

# కుయ్యో..మొర్రో అంటున్న కెనడా, బ్రెజిల్

న్యూఢిల్లీ, జూలై 15, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున?న విధానాలు ఇటు అమెరికన్లతోపాటు అటు ప్రపంచ దేశాలకు నచ్చడం లేదు. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. తీసుకుంటన్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. వాణిజ్యం విషయంలో విధిస్తున్న టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపుతోంది. తమకు అనుకూలంగా లేని, తమ మాట వినని దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధిస్తున్నారు. తాజాగా బ్రెజిల్, కెనడాపై టారిఫ్ మోత మోగించాడు. కెనడాపై 35 శాతం సుంకం, ఇతర వాణిజ్య భాగస్వాములపై 15-20 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఇది ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈ నిర్ణయం కెనడాతో వాణిజ్య ఒత్తిడిని పెంచింది. ఇక బ్రిక్స్ సమావేశం, ప్రత్యేక కూటమి నేపథ్యంలో బ్రెజిల్‌పైనా 50 శాతం సుంకాలు విధించారు. దీంతో బ్రెజిల్‌లో అమెరికాకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 35 శాతం సుంకం విధించనున్నట్లు ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రకటించారు. ఇది ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈ సుంకం గతంలో విధించిన 25 శాతం సుంకం కంటే అధికం. కెనడా ప్రతీకార సుంకాలు విధిస్తే ఈ రేటు మరింత పెరుగుతుందని ట్రంప్ హెచ్చరించారు. ఫెంటనిల్ డ్రగ్ దిగుమతులను నియంత్రించడంలో కెనడా విఫలమైందని, అమెరికా వాణిజ్య లోటును పెంచే వాణిజ్య విధానాలను అనుసరిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఈ సుంకం కెనడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడా ఎగుమతులలో 75 శాతం అమెరికాకు వెళ్తుంది. ట్రంప్ ఈ చర్య వాణిజ్య ఒప్పందాలను ఒత్తిడి చేయడానికి, ఫెంటనిల్ వంటి సమస్యలపై కెనడా నుంచి సహకారం రాబట్టడానికి ఒక వ్యూహంగా కనిపిస్తుంది.ఇక బ్రెజిల్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. దీంతో సావో పాలోలోని పాలిస్టా అవెన్యూలో వేలాది మంది నిరసనకారులు ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ, నినాదాలతో ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ విధానాలను ప్రజల శత్రుత్వంగా అభివర్ణించిన నిరసనకారులు, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారో విచారణకు సంబంధించి ట్రంప్ టారిఫ్‌లను రాజకీయ ఒత్తిడిగా భావిస్తున్నారు.

50 శాతం సుంకం బ్రెజిల్ ఎగుమతులను, ముఖ్యంగా ఉక్కు, అల్యూమినియం, వ్యవసాయ ఉత్పత్తులను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ నిరసనలు ట్రంప్ వాణిజ్య విధానాలు కేవలం ఆర్థిక చర్యలు మాత్రమే కాక, రాజకీయ ఒత్తిడి సాధనంగా కూడా పనిచేస్తున్నాయని భావిస్తున్నారు.కెనడా ఇప్పటికే అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలను విధించింది. ట్రంప్ హెచ్చరికల ప్రకారం, కెనడా మరిన్ని సుంకాలు విధిస్తే, అమెరికా టారిఫ్‌లు మరింత పెరుగుతాయి. బ్రెజిల్ కూడా ప్రతీకార సుంకాలను పరిశీలిస్తోంది. ఇది గ్లోబల్ వాణిజ్యంలో అస్థిరతను పెంచనుంది. ఈ టారిఫ్‌లతో అమెరికా వినియోగదారులకు వస్తువుల ధరలు పెరగడం, ఆటోమొబైల్, ఉక్కు, అల్యూమినియం వంటి పరిశ్రమలపై ప్రభావం పడనుంది. ఇది వాణిజ్య యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది.గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితిని సృష్టిస్తుంది.

# ఆ ఎనిమిది సంగతి అంతేనా

## 45కు చేరిన మృతులు

మెదక్ జూలై 15, సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో మృతుల సంఖ్య నలభై ఐదుకు చేరింది. చికిత్స పొందుతున్న వారు ఇంకా మరణిస్తూనే ఉన్నారు. గత నెల 30వ తేదీన సిగాచీ రసాయన పరిశ్రమలో ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు పూర్తిగా నిలిపివేశారు. కర్మాగారాన్ని కూడా మూడు నెలల పాటు మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే ఎనిమిది మంది కార్మికుల జాడ మాత్రం ఇంత వరకూ దొరకలేదు. ప్రమాదం జరిగి దాదాపు పదిహేను రోజులు దాటుతున్నప్పటికీ ప్రమాదం సమయంలో కంపెనీలో పనిచేస్తున్న ఎనిమిది మంది దొరకకపోవడంతో వారు కుటుంబ సభ్యులు కూడా ఆశలు వదులుకుని వారి సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. జాడ తెలియని ఆ ఎనిమిది మంది కాలి బూడిదయిపోయి ఉంటారని, అందుకే కనీసం శరీరభాగాలు కూడా దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. తప్పిపోయిన వారిని రాహుల్, రవి, వెంకటేవ్, ఇర్ఫాన్, విజయ్, అఖిలేశ్, జస్టిన్, శివాజీలుగా గుర్తించారు. కానీ చివరి చూపు కూడా దక్కకుండా, కనీసం వారి అస్థికలను కూడా నిమజ్జనం చేయడానికి లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. పది హేను రోజులు దాటుతుండటంతో సహాయక కార్యక్రమాలను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. ఏదైనా సమాచారం అందితే తాము మళ్లీ పిలుస్తామని ఎనిమిది మంది కి సంబంధించిన కుటుంబ సభ్యులను వారి స్వస్థలాలకు పంపించి వేశారు. మళ్లీ లక్షకు చేరువలో బంగారం మరొకరు మరణించడంతో... కాగా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరొక కార్మకుడు మరణించాడు. పశ్చిమబెంగాల్ కు చెందిన తరపాడుతుడు అనే కార్మికుడు మదీనాగూడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో మరణించిన వారి సంఖ్య నలభై ఐదుకు చేరింది. అక్కడ లభించిన మానవ శరీర భాగాలను డీఎన్ఏ రిపోర్టుల కోసం పంపినా అందులో కూడా తేలలేదు. దాదాపు 70 వరకూ నమూనాలను సేకరించి పంపారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆచూకీ దొరకని మృతుల కుటుంబ సభ్యుల వాదన మరోలా ఉంది. మృతదేహాల వెలికితీతలో మొదటి నుంచి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. సాధ్యమైనంత వేగంగా శిథిలాల తొలగింపు చేయాల్సి ఉండగా, నెమ్మదిగా తొలగింపు ప్రక్రియ జరగడంతో మృతదేహాల గుర్తింపు కష్టమవ్వడంతోపాటు, మాంసపు ముద్దలుగా విడిపోవడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో ఇప్పుడు మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో మృతుల ఆచూకీ లభించలేదని సర్టిఫికేట్ ఇవ్వమని వారి కుటుంబ సభ్యులు అడిగినా పట్టించుకోవడంలేదు. మేము నిర్ధారించము, మూడు నెలల తరువాత రండి అప్పుడు చూద్దామంటూ తేల్చిచెప్పడం దిక్కుతోచని స్థితిలో ఆచూకీ దొరకని 8 మందికి చెందిన కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా వెనుదిరిగి తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. సిగాచీ యాజమాన్యం ఘటనా స్థలానికి చేరుకోలేదు. డబ్బుతో ఏదైనా సాధ్యమే అన్నట్లుగా యాజమాన్యం తీరు కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం ప్రకటించాం. మృతదేహాల కోసం ఆలోచించాల్సిన పనేలేదు అన్నట్లుగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లుతెత్తున్నాయి.ఐదు నెలల క్రితమే పెళ్లైన ఉప్పల్ కు చెందిన అఖిల్ ఫ్యాకర్టీలోకి వచ్చినట్లు భార్యకు మెసేజ్ పెట్టిన పదినిమిషాల్లోనే బ్లాస్ట్ జరిగింది. తండ్రికి ఏకైక ఆధారంగా ఉన్న జస్టిన్ ఇక తిరిగి రాడని తెలిసిన తండ్రి దిక్కుతోచని స్థితిలో బోరున విలపిస్తున్నాడు.

# భారత్ జలవ్యూహం..

శ్రీనగర్, జూలై 15, పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలు ధ్వంసమయ్యాయి. 11 ఎయిర్ బేస్‌లపై భారత్ వైమానిక దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్‌లోని విమానాలు కూడా ఎగరలేని పరిస్థితి నెలకొంది. ఈ ఆపరేషన్ తర్వాత భారత్ ఏం చేయగలతో నిరూపితమైంది. అయినా పాకిస్తాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. సింధూ జలాల ఇవ్వకపోతే యుద్ధం చేస్తామని ప్రకటిస్తోంది. అయినా మోదీ పాకిస్తాన్ నీటితో గేమ్స్ మొదలు పెట్టారు.సింధూ జల ఒప్పందం (1960) భారత్?పాకిస్తాన్ మధ్య నీటి వనరుల పంపిణీకి కీలకం. ఈ ఒప్పందం ప్రకారం, బియాస్, రావి, సట్లెజ్ నదులు భారత్‌కు, ఇండస్, చినాబ్, ఝీలం నదులు పాకిస్తాన్‌కు కేటాయించబడ్డాయి. అయితే, 2025 ఏప్రిల్‌లో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఈ ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. ఈ నిర్ణయం భారత్‌కు నీటి వనరులపై ఎక్కువ నియంత్రణను ఇచ్చింది, ఫలితంగా పాకిస్తాన్‌లో నీటి కొరత, వరదల వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు మరో నదిపైనా భారత్ పవర్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో చినాబ్ నదిపై నిర్మితమవుతున్న క్వార్ హైడ్రో ప్రాజెక్టు ఒక రన్?ఆఫ్?ది?రివర్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. ఈ ప్రాజెక్టు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది.క్వార్ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం 19% పనులు పూర్తయ్యాయి, రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.4,500 కోట్ల అంచనా వ్యయం ఉంది, ఇందులో రూ.3 వేల కోట్లు రుణాల ద్వారా సేకరించబడుతున్నాయి. చినాబ్ నది పాకిస్తాన్‌కు కేటాయించిన నది కావడంతో, క్వార్ ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం కలిగి ఉంది. ఇది పాకిస్తాన్ వ్యవసాయానికి, ముఖ్యంగా ఇండస్ నదీ వ్యవస్థపై ఆధారపడే పంటలకు సవాళ్లను సృష్టించవచ్చు.సింధూ జల ఒప్పందం సస్పెన్షన్, క్వార్ వంటి ప్రాజెక్టుల త్వరితగతిన నిర్మాణం భారత్ నీటి వనరులను రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తోందని సూచిస్తున్నాయి. ఇది భారత్‌కు శక్తి భద్రతను పెంచడమే కాక, పాకిస్తాన్‌పై ఒత్తిడిని కూడా పెంచుతుంది. సిందూ ఒప్పందం పునఃసమీక్షకు భారత్ పట్టుపడుతోంది. అది జరిగేలోగా క్వార్ ప్రాజెక్టు పూర్తి చేయాలని భారత్ భావిస్తోంది. అది పూర్తయితే పాకిస్తాన్ చినాబ్ నదికి నీటిని విడుదల చేయడం అనివార్యం అవుతుంది. మొత్తంగా భారత్ నుంచి పాకిస్తాన్‌కు వెళ్లాల్సిన సిందు జలాలు, పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి రావాల్సిన చినాబ్ జలాలతో మోదీ గేమ్స్ మొదలు పెట్టారు.

# భారీగా తగ్గిన బియ్యం ధరలు

హైదరాబాద్, జూలై 15,తెలంగాణలో సన్న బియ్యం ధరలు భారీగా తగ్గాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేట్లు అమాతం దిగి వచ్చాయి. గతంలో క్వింటా రూ. 5-6 వేల మధ్య పలికిన ధరలు, ప్రస్తుతం భారీగా తగ్గాయి. క్వింటా సన్నబియ్యం రూ.4-4,500 వేల మధ్య దొరుకుతున్నాయి. సన్న వడ్లకు సర్కార్ బోనస్ ప్రకటించటం, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, మూడు నెలల రేషన్ కింద సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడంతో మార్కెట్‌లో బియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి.రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ సన్న వడ్లపై రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్న వడ్ల సాగు విస్తీర్ణం దాదాపు రెట్టింపు అయింది. దీంతో ధాన్యం దిగుబడి భారీగా పెరిగి, సప్లై కూడా పెరిగింది. ఇది ధరలపై ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.60 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు 17,349 రేషన్ షాపుల ద్వారా గత నెలలో మూడు నెలలకు సంబంధించి 4.73 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ భారీ పంపిణీ కారణంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ గణనీయంగా తగ్గింది.దానికి తోడు తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుండి సన్న బియ్యం ఆర్డర్లు తగ్గడం కూడా ధరల పతనానికి మరో కారణమని వ్యాపారులు చెబుతున్నారు.కాగా, జూన్ నుంచి క్రమంగా బియ్యం ధఅలు తగ్గుతున్నాయి. జూలై మొదటి వారంలో మరింత పడిపోయాయి. గత ఏడాది క్వింటాల్ రూ.5,600 ఉన్న హెచ్ఎంటీ రకం బియ్యం ధర ఇప్పుడు రూ.4,600కు తగ్గింది. కర్నూల్ మసూరి రకం రూ.4,000కు చేరుకోగా, జై శ్రీరాం రకం రూ.5,800 నుంచి రూ.4,600కు పడిపోయింది. ఆర్ఎన్ఆర్, సాంబా రకాల ధరలు కూడా క్వింటాల్ రూ.1,000 వరకు తగ్గాయి.తగ్గిన ధరలు మధ్యతరగతి వినియోగదారులకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. రేషన్ కార్డులు లేని సుమారు 30 లక్షల కుటుంబాలకు, నెలకు 60 వేల టన్నుల బియ్యం అవసరం ఉండగా.. వారికి ఈ ధరల తగ్గుదల లాభదాయకంగా మారింది. అయితే, బహిరంగ మార్కెట్‌లోని బియ్యం వ్యాపారులకు గిరాకీ 20 శాతానికి పైగా పడిపోయింది. హైదరాబాద్ నగరంలోని రైస్ షాపుల్లో రోజువారీ కొనుగోళ్లు భారీగా తగ్గాయని, కొన్ని ప్రాంతాల్లో బోనీ కూడా లేదని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో నెలకు 250 క్వింటాళ్ల బియ్యం అమ్మిన షాపులు ఇప్పుడు 100 క్వింటాళ్లు కూడా అమ్మలేని పరిస్థితి నెలకొందని రామంతపూర్‌కు చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి ఆందోళన వ్యక్తం చేశారు.



# సొంత జిల్లాకు మంత్రి దూరం



## పాపం ..వివేక్

అదిలాబాద్, జూలై 15, రాష్ట్ర మంత్రి అంటే రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లిరావచ్చు.. కానీ, ఓ మంత్రి మాత్రం తన సొంత పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో మాత్రం కాలు పెట్టలేకపోతున్నారు. కాదు.. కాదు.. కాలు పెట్టనివ్వడం లేదు. మంత్రి మా నియోజకవర్గంలోకి రావొద్దంటూ సొంత పార్టీ నేతలే హెచ్చరించడంతో మంత్రి అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇటీవలే కొత్తగా మంత్రి వర్గంలోకి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట్‌స్వామికి సొంత పార్టీ కాంగ్రెస్‌లో, పైగా సొంత జిల్లాలోనే తలనొప్పులు తప్పడం లేదు. ఎన్నికల వరకు వేరే పార్టీలో ఉన్న వివేక్ వెంకట్ స్వామి ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఆయన వచ్చీ రావడంతోనే తనకు, తన అన్న వినోద్ కు టిక్కెట్టు సాధించుకున్నారు. అంతేకాకుండా, తన కొడుకు వంశీకి సైతం పెద్దపల్లి ఎంపీ టిక్కెట్టు సాధించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా తండ్రీకొడుకు గెలుపొందారు. ఇదంతా ఒక్కెత్తు కాగా, మరో బంపర్ ఆఫర్ కొట్టేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన మంత్రి వర్గ విస్తరణలో మంత్రి కూడా అయ్యారు. అయితే, ఇన్ని రోజులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి పదవిపై ఆశపెట్టుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావ్ అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. తాను ఎన్నో ఏండ్లుగా పార్టీని పట్టుకుని ఉంటున్నానని, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సైతం ఆయన పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నానని, తనపై ఎన్నో కేసులు కూడా నమోదు అయినా, వాటన్నింటిని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేశానని ప్రేంసాగర్ రావ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో నిర్వహించిన భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభను సైతం విజయవంతం చేయడంలో ప్రేమ్ సాగర్ రావ్ కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ అధిష్టానం ఏం ఆలోచించిదో ఏమో కానీ... ప్రేమ్ సాగర్ రావ్ ను కాదని వివేక్ కు మంత్రి పదవి కట్టబెట్టింది. దీంతో అటు ప్రేం సాగర్ రావ్, ఆయన అనుచరవర్గం ఇప్పుడు వివేక్ అంటే మండి పడుతున్నారు. తాము ఎన్నో ఏండ్లుగా కష్టపడి పార్టీని కాపాడుకుంటూ వస్తే కేసులకు భయపడకుండా, ఒత్తిళ్లకు తలొగ్గకుండా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటే.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వివేక్ ను మంత్రి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ లో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావ్ ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి మంత్రి పదవి గురించి నిలదీశారు. పార్టీ కోసం కష్టపడ్డది తామైతే ఫలితం దక్కింది మరొకరికి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయనకు చీఫ్ విప్ పదవి ఇవ్వాలని అధిష్టానం భావించింది కానీ ఆ ఆఫర్ ను ప్రేమ్ సాగర్ రావ్ తిరస్కరించారు. తనకు మంత్రి పదవి తప్ప వేరే ఏం వద్దంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. దీంతో తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆయనను కలిసి బుజ్జగించి.. మరో మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ తమ నేతకు అన్యాయం చేసిందని ఆగ్రహంతో ఉన్న ప్రేమ్ సాగర్ రావ్ అనుచరులు తమ నేతకు దక్కాల్సిన మంత్రి పదవి గద్దలా తన్నుకుపోయిన గడ్డం వివేక్ పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో తన కొడుకు వంశీకృష్ణను గెలిపిస్తే ప్రేంసాగర్ రావ్ మంత్రి పదవికి తాను అడ్డురానని చెప్పిన వివేక్.. తీరా మంత్రి కావడం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రేంసాగర్ రావ్ ఆయన అనుచరవర్గం తమ నియోజకవర్గంలో అడ్డుపెట్టొద్దని ఏకంగా మంత్రి వివేక్ కే అల్టిమేటం జారీ చేశారు. ఒకవేళ మంత్రి మంచిర్యాల వస్తే గొడవలు తప్పవని, ఆయనను మంచిర్యాల అడుగుపెట్టనీయమని ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్ సైతం నా నియోజకవర్గంలో నేనే రాజు.. నేనే మంత్రి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి వారికి న్యాయం చేసేలా తాను ముందుంటానన్నారు. దీంతో మంత్రి వివేక్ సైతం ఆయన నియోజకవర్గంలో ఎందుకైనా మంచిదని, ఆ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో అడుగుపెట్టకుండా మంత్రి వివేక్ సైతం జాగ్రత్త పడుతున్నారు. మంత్రి పదవి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు సైతం ఇందారం మీదుగా చెన్నూరు నుంచి అటు వైపుగా మందమర్రి వెళ్లిన మంత్రి మంచిర్యాలలో తన నివాసానికి వెళ్ళి హైదరాబాద్ కు వెళ్ళిపోయారు. ప్రేంసాగర్ రావ్, ఆయన అనుచరుల హెచ్చరికల వల్ల.. పార్టీ పెద్దలను సైతం నొప్పించడం ఇష్టంలేక మంత్రి వివేక్ వెంకటస్వామి మంచిర్యాల నియోజకవర్గానికి రావడం లేదు. తన నియోజకవర్గ అభివృద్ధి ఆగకుండా చూసుకుంటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావ్, ఆయన అనుచరులు మంత్రిని మాత్రం నియోజకవర్గంలో అడుగుపెట్టనిచ్చేది లేదని భీష్మించుకున్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహా ముగ్గురు మంత్రులు జిల్లా ఇన్చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటించి.. మంచిర్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి సహా, ముగ్గురు మంత్రులు తన సొంత జిల్లాకు వచ్చినప్పటికీ ఈ కార్యక్రమానికి సైతం మంత్రి వివేక్ హాజరుకాలేదు. ఇదే సమయంలో మంత్రి వివేక్ వెంకట స్వామి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అటూ మంచిర్యాల జిల్లాలో ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రుల పర్యటన ఉంటే వివేక్ వెంకటస్వామి మాత్రం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించడం అంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే మరో మంత్రి వర్గ విస్తరణలో ప్రేమ్ సాగర్ రావ్ కు అధిష్టానం అవకాశం కల్పిస్తుందా... ? రోజుల్లో మంత్రిగా వివేక్ ఎప్పుడైనా మంచిర్యాల నియోజకవర్గంలో అడుగు పెడతారా.. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొం టారా..? అంటే మరికొద్ది రోజులు వేచి చూడాలి. ఈ విషయం ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# జేఎన్టీయూలో 60 లక్షల ప్యాకేజీ

అనంతపురం, జూలై 15, హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లో బీటెక్ చివరి ఏడాది చదువుతోన్న విద్యార్థి జాక్ పాట్ కొట్టాడు. అతడికి రూ.60 లక్షల ప్యాకేజీతో అద్భుతమైన ఆఫర్ వచ్చింది. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ అతడికి నెలకు రూ.2 లక్షల ఉపకార వేతనంతో పాటు, అదనంగా రూ.60 లక్షల వేతన ప్యాకేజీని ఆఫర్ చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువకుడు తన ప్రతిభతో ఈ ఘనత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ అండ్ ఫైనాన్షియల్ ట్రేడింగ్ కంపెనీ 'డీఈ షా' క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించింది. ఒక్క ఉద్యోగం కోసం కంప్యూటర్ సైన్స్, ఏఐఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అనేక పరీక్షల తరువాత, ఖమ్మంకి చెందిన విద్యార్థి షేక్ సోహెల్ ఫైనల్ ఇంటర్వ్యూలో విజేతగా నిలిచాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( ఐఐటీ)ల్లో చదివే విద్యార్థులకే కంపెనీలు అధిక ప్యాకేజీలు ఆఫర్లు చేస్తున్న సంగతి తెలిసిందేతనకు ఎంత పరిజ్ఞానం ఉందనే దానికంటే, సమస్యను పరిష్కరించిన విధానం డీఈ షా కంపెనీ ప్రతినిధులను ఆకట్టుకుందని సోహెల్ తెలిపాడు. 'ఇచ్చిన 30 నిమిషాల్లోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాను' అని సోహెల్ చెప్పాడు. ఉన్నత చదువులతో మంచి ఉద్యోగం సాధించాలనే తన కలకు రెక్కలు ఇచ్చి.. ఎగిరేలా స్ఫూర్తినిచ్చింది హైదరాబాదే అని సోహెల్ ఆనందం వ్యక్తం చేశాడు. ఖమ్మం జిల్లాకు చెందిన సోహెల్.. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబం నుంచి వచ్చాడు. ఆరేళ్ల క్రితం తన తండ్రి బడేమియా అనారోగ్యంతో చనిపోయాడని.. అప్పటి నుంచి తల్లి చాన్‌బాను అన్నీ తానై చూసుకుందని చెప్పాడు. తన విజయానికి ఆమె మద్దతు ఎంతో ఉందని సోహెల్ తెలిపాడు. సోహెల్ ప్రస్తుతం బీటెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) చివరి ఏడాది చదువుతున్నాడు. భారీ ప్యాకేజీతో ఉద్యోగం పొందిన సోహెల్‌కు జేఎన్టీయూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఐఐటీ బాంబే విద్యార్థులకు భారీ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తుంటాయి.కాగా, గతేడాది కూడా జేఎన్‌టీయూకు చెందిన విద్యార్థినికి డీఈ షా రూ.52 లక్షల ప్యాకేజీ ఆఫర్ చేసింది. గత ఫిబ్రవరిలో ఒక్క ఉద్యోగం కోసం డీఈ షా క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించగా.. వంద మందికిపైగా హాజరయ్యారు. వీరిలో చల్లా సాయికృతి అనే అమ్మాయిని గోల్డెన్ ఆఫర్ వరించింది. మూడు రౌండ్ల అనంతరం సాయికృతిని ఎంపిక చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆమె.. అక్క స్ఫూర్తితో సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకుంది.

# స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి రాజాసింగ్



అదిలాబాద్, జూలై 15,బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలంగాణ రాజకీయాల్లో ఓ సంచలనం. హిందుత్వ ఎజెండాతో ఆయన చేసే వ్యాఖ్యలు జాతీయ మీడియాలోనూ మారుమోగుతుంటాయి. ఇక అంతర్జాతీయ టెర్రరిస్టుల నుండి కూడా బెదిరింపులు వస్తున్నాయని రాజాసింగ్ పలుమార్లు చెప్పడం ఆయన ఇమేజ్‌కు నిదర్శనం. అలాంటి రాజాసింగ్ రాజకీయ భవిష్యత్తుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇటీవలే రాజాసింగ్ పార్టీకి చేసిన రాజీనామాను ఆమోదించారు. ఈ క్రమంలో రాజాసింగ్ రాజకీయ అడుగులు ఎటువైపు అన్న చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది. అయితే రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే ఏదో పార్టీలో చేరకతప్పదు. రాజాసింగ్ గోషామహల్ నియోజకవర్గంలో పట్టున్న నేత. బీజేపీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భాలు ఉన్నాయి. ఇది పార్టీ గుర్తింపుతో కాకుండా, నియోజకవర్గంలో ఆయనకున్న సొంత బలంగానే చూడాలి. రాజాసింగ్ 2009లో టీడీపీ నుండి జీహెచ్ఎంసీలోని మంగళ్‌హాట్‌లో కార్పొరేటర్‌గా గెలిచారు. 2014 వరకు అదే పదవిలో ఉన్నారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. ఇలా పార్టీ ఏది మారినా తన హిందుత్వ సిద్ధాంతాలను మాత్రం వదులుకోలేదు. ఇదే రాజాసింగ్ బలంగా చెప్పవచ్చు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో చేరేది లేదని ఇప్పటికే రాజాసింగ్ తేల్చి చెప్పిన విషయం అందరికీ తెలిసిందే. ఇక బీజేపీలో ఉన్న అంతర్గత గొడవల కారణంగానే బయటకు వచ్చారు. ఇక మిగిలిన చిన్న పార్టీలు వామపక్షాలు, ఎం.ఐ.ఎంలు మాత్రమే. ఈ రెండు పార్టీలు తన హిందుత్వ సిద్ధాంతాలకు ప్రధాన శత్రువులు, కాబట్టి ఆ పార్టీలలో చేరే అవకాశమే లేదు. ఈ క్రమంలో రాజాసింగ్‌కు పార్టీల గుర్తింపు కాకుండా హిందుత్వవాదిగా మంచి గుర్తింపు ఉంది. తన సొంత బలంతో వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా కూడా గెలిచే అవకాశాలు లేకపోలేదు. ఇది రాజాసింగ్‌కు ఉన్న మొదటి ఆప్షన్.ఏ పార్టీలో చేరకుండా సొంత పార్టీ పెట్టడం. అయితే ఇది చాలా కష్టమైన పని. ఒక రాజకీయ పార్టీని పెట్టి దాన్ని నడపడం అనేది చాలా కష్టమైన విషయం. పార్టీ పెట్టాలంటే బలమైన సిద్ధాంతం, రాజకీయ వ్యూహం, రాష్ట్ర రాజకీయాల్లో నాయకత్వ శూన్యత, భారీగా నిధులు సేకరించడం, పటిష్టమైన క్యాడర్‌ను తయారు చేసుకోవడం – ఇవి ప్రస్తుత రాజకీయాల్లో సాధ్యమైన పనులు కావు. హిందుత్వ ఎజెండాతో పార్టీ పెట్టాలనుకున్నా, రాష్ట్రంలో ఇప్పటికే బీజేపీ ఆ స్థానంలో ఉండనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో చిన్న పార్టీలు మనుగడ సాధించే పరిస్థితుల్లో లేవు. ఇది రెండో ఆప్షన్‌గా తీసుకోవాలనుకున్నా రాజాసింగ్ వంటి నేతకు చాలా కష్టమైన లక్ష్యంగా చెప్పుకోవచ్చు.బీజేపీలాగా హిందుత్వ సిద్ధాంతంతో నడుస్తున్న శివసేన వంటి జాతీయ పార్టీలో చేరడం మూడో ఆప్షన్. మహారాష్ట్ర పార్టీ అయినప్పటికీ హిందుత్వ వాదంతో ఉండి, బీజేపీకి దూరంగా ఉన్న పార్టీ కావడం వల్ల రాజాసింగ్ ఈ ఆప్షన్‌ను ఎంచుకునే అవకాశం లేకపోలేదు. తెలంగాణలో ఈ పార్టీ లేనప్పటికీ హిందుత్వ వాదంతో హైదరాబాద్ వంటి నగరంలో శివసేనను బలోపేతం చేసే అవకాశం లేకపోలేదు. మహారాష్ట్రలో కూడా ముంబైలోనే శివసేన పార్టీ బలంగా ఉన్న చరిత్ర ఉంది. ఆ తర్వాత క్రమక్రమంగా మహారాష్ట్ర అంతటా వ్యాపించి బలమైన పార్టీగా శివసేన రూపొందింది. ఈ పార్టీలో చేరడం ద్వారా రాజాసింగ్ తన హిందుత్వ భావజాలాన్ని దేశవ్యాప్తంగా వినిపించే అవకాశం లేకపోలేదు. రాజాసింగ్ వంటి నేతలు వస్తే శివసేన పార్టీ తెలంగాణ అధ్యక్షుడు అయ్యే అవకాశం లేకపోలేదు.అసంతృప్తితో రాజాసింగ్ బీజేపీకి రాజీనామా చేయడం, దాన్ని పార్టీ ఆమోదించడం చకాచకా జరిగిపోయాయి. అయితే గతంలోనూ రాజాసింగ్ పార్టీ లైన్ దాటి చేసిన పరుష వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుని బీజేపీ ఆయన్ను సస్పెండ్ చేసింది. గత శాసనసభ ఎన్నికల ముందే తిరిగి పార్టీలోకి తీసుకుని గోషామహల్ టికెట్‌ను బీజేపీ రాజాసింగ్‌కు ఇచ్చింది. ఆ ఎన్నికల్లో రాజాసింగ్ గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. తిరిగి ఇదే కథ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం కావచ్చు. తిరిగి బీజేపీలోనే ఎన్నికల ముందు చేరి గోషామహల్ నుండి పోటీ చేసే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే గోషామహల్‌లో రాజాసింగ్‌ను మించి బలమైన అభ్యర్థి బీజేపీకి దొరికే అవకాశం లేదనే చెప్పాలి. రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదన్న రాజకీయ నానుడి రాజాసింగ్ విషయంలో జరిగవచ్చు.రాజాసింగ్‌కు ఉన్న ఈ నాలుగు ఆప్షన్లలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను బట్టి ఆయన గోషామహల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. తన సైద్ధాంతిక బలం, ఎమ్మెల్యేగా తనకున్న ఫాలోయింగ్‌ను మరింత పెంచుకుని గోషామహల్‌లో బలమైన నేతగా ఉండటాన్నే రాజాసింగ్ తన ఆప్షన్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. లేదనుకుంటే సైద్ధాంతిక సామీప్యత ఉన్న శివసేన పార్టీలో చేరి గోషామహల్‌లో ఆ పార్టీ గుర్తు మీద పోటీ చేసే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. అంతేకాకుండా బీజేపీకి పోటీగా హిందుత్వ ఎజెండాను తీసుకెళ్లే శివసేనకు తెలంగాణలో రాజాసింగే నాయకత్వం వహించే అవకాశం ఉంటుంది. ఇక మిగిలిన రెండు ఆప్షన్స్‌ను రాజాసింగ్ అమలు చేసే అవకాశాలు చాలా తక్కువ. పార్టీ పెట్టి నడిపించడం అంత తేలిక కాదు. అదే రీతిలో బీజేపీ నుండి విభేదించి మళ్లీ ఆ పార్టీలో చేరే అవకాశాలు తక్కువ. అయితే ఇంతకు ముందు చెప్పినట్లు రాజకీయాల్లో చివరి రెండు ఆప్షన్స్‌ను రాజాసింగ్ తీసుకోరని మాత్రం చెప్పలేం. కానీ ఆ అవకాశాలు ప్రస్తుత పరిస్థితిని బట్టి తక్కువనే చెప్పాలి.

# కొండా సుస్మిత ఎంట్రీపై ఉత్కంఠ

వరంగల్, జూలై 15,కొండా దంపతుల ఎపిసోడ్‌తో వరంగల్ కాంగ్రెస్ రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. సురేఖ, మురళి దంపతుల కుమార్తె కొండా సుష్మితా పటేల్ పొలిటికల్ ఎంట్రీ కూడా చర్చకు దారి తీసింది. గత కొంతకాలంగా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్న సుష్మితా ఇటీవల తన సోషల్ మీడియాలో 'పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి' అని పేర్కొనడం చర్చకు దారితీసింది. ఇది వరంగల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రకంపనలు సృష్టిస్తోంది. కొండా దంపతుల రాజకీయ వారసురాలిగా సుష్మితను రంగంలోకి దిగుతోందని ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల సమయంలో కూడా ఆమె పేరు వినిపించింది, పరకాల నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రచారం కూడా జరిగింది. అయితే చివరి నిమిషంలో ఆ సీటును రేవూరికి కేటాయించడంతో ఆమె వెనక్కి తగ్గింది.వరంగల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు చెలరేగుతున్న సమయంలో కొండా సుష్మితా పటేల్ తన ఇన్‌స్టాగ్రామ్ బయోను 'పరకాల ఆస్పిరెంట్' (పరకాల టికెట్ ఆశిస్తున్నాను) అని అప్‌డేట్ చేయడంతో రాజకీయ



వర్గాల్లో చర్చ మె?దలైంది. అనంతరం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యే కొండా దంపతులపై కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఇది వరకే వివరణ ఇచ్చిన కొండా మురళీ తాజాగా.. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ లిఖతపూర్వకంగా వివరణ అందజేసారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమ కూతురి రాజకీయ ఎంట్రీపై కొండా దంపతులు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తమ కూతురు ఆలోచనను తాము కాదనలేమని అన్నారు. తనలో ప్రవహించేది తమ రక్తం కాబట్టి.. వారసత్వం కొనసాగుతుందని అన్నారు.తన రాజకీయ భవిష్యత్తును ఎలా ప్లాన్ చేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. అయితే, పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో దానికి కట్టుబడి ఉంటామని ఆమె తెలిపారు. మరోవైపు కొండా మురళి మాత్రం కొంత భిన్నంగా స్పందించారు. తన కూతురు ఎక్కడి నుంచి పోటీ చేయడం లేదని చెప్పారు. ఒక్కొక్కరి ఆలోచన ఒక్కోలా ఉంటుందని.. తన కూతురు తొందరపడి అన్నదో.. ఆలోచించి అన్నదో తనకైతే తెలియదని అన్నారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం వరంగల్ పాలిటిక్స్‌లో హాట్ టాఫిక్‌గా మారాయి. ఆమె పొలిటికల్ ఎంట్రీపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# పారిశుధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి ,సుల్తానాబాద్ పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ పట్టణంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమం, మెంటలీ డిజేబుల్ హోమ్, చిల్డ్రన్ హోమ్, షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ పురపాలక కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సుల్తానాబాద్ లోని వృద్ధాశ్రమం, మెంటలీ డిజేబుల్ హోమ్, చిల్డ్రన్ హోమ్ పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేసి 2 నెలల్లో ఈ భవనాలను ప్రారంభించాల ని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ భవనాలలో వృద్ధులకు పిల్లలకు అనుకూ లంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ పనులను సైతం 2 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రాధాన్యత కల్పించాలని, రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వన మహోత్సవం హ కార్యక్రమం కింద సుల్తానాబాద్ మున్సిపాలిటీకు కేటాయించిన లక్ష్యం మేరకు గుంతల తవ్వకం పనులు పూర్తి చేసి నాటికి మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు.

# శానిటేషన్ సంగతి అంతేనా

కరీంనగర్, జూలై 15,కరీంనగర్ నగరపాలక సంస్థ దిన దినం విస్తరిస్తుండగా పారిశుధ్య సమస్య రోజు రోజుకు పెరిగిపోతున్నది. శివారు గ్రామాలు విలీనం కావడంతో గతంలో ఉన్న 60 డివిజన్లు 66 గా మారాయి. ప్రస్తుతం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కీలకమైన పారిశుధ్య వి భాగం ఒక ఔట్ సోర్సింగ్ అధికారి చేతిలో ఉంది. ఒకప్పుడు పారిశుధ్య విభాగంలో అవార్డులు అందుకున్న కరీంనగర్ నగరపాలక సంస్థ నేడు అస్తవ్యస్తంగా మారింది.నగరపాలక సంస్థ పరిధిలో 92 మంది ఉద్యోగులు పారిశుధ్య విభాగంలో పనిచేస్తుండగా 1100 మంది వరకు ఔట్ సో ర్సింగ్ కింద పనిచేస్తున్నారు. ప్రతి డివిజన్ ఒక జవాను, జవాను కింద 11 నుంచి 15 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. జవాన్లపైన సానిటరీ ఇన్స్పెక్టర్లు పని చేస్తున్నారు. అయితే ఒకరిపై ఒకరి నియంత్రణ కొరవడడంతో పారిశుధ్య విభాగం అస్త వ్యస్తంగా మారి నగరంలో పారిశుధ్యం పడకేసింది. మొన్నటి వరకు పాలకవర్గం ఉండగా ఆయా డివిజన్ల పరిధిలో కార్పొరేటర్లు తమ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నించేవా రు.ఇప్పుడు డివిజన్ల వారీగా ని యమించిన అధికారులు ఇతర వి భాగాలకు చెందినవారు కావడం, వారు త మ తమ శాఖల్లో తలమునకలై ఉంటుండడంతో డివిజన్లలో పారిశుధ్య పనులు పర్య వేక్షించేవారు కరువయ్యారు. జవాన్లు ఉద యం 7 గంటల నుంచి కార్మికులు పని దిగే వరకు నాలుగు పర్యాయాలు అటెండెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ అటెండెన్స్ విధానానికి జవాన్లు స్వస్తి పలికి కొన్ని చోట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పారిశు ధ్య ఆటో నిర్వాహకుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుకున్నాయి.కార్మి కులు ఇదేమని అడిగితే ఉద్యోగాల నుండి తీసివేస్తూ భయ భ్రాంతులను సృష్టిస్తున్నారు. నె ల రోజుల క్రితం ముగ్గురు కార్మికులను తొలగించగా బీఆర్టీయూ కార్మిక సం ఘం ఆధ్వర్యంలో ఆందోళన చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. మీరు ఆందోళన చేస్తున్నా రు కనుక మిమ్ములను తీసుకోమని అధికారులు హెచ్చరిస్తుండడంతో కార్మికులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.గతం లో సానిటేషన్ విభాగం ఆ శాఖ పరిధి అధికారుల చేతిలో ఉండేది. చెందిన ఒక అధికారికి అప్పజెప్పి ఫుల్ పవర్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన కిందే సానిటేషన్ విభాగం ఉంది. డీజిల్ కూపన్ల జారీ నుండి పారిశుధ్య విభాగాన్ని ఆయనే పర్యవేక్షిస్తుంటారు. కొందరు జవాన్లు డబ్బులు వసూలు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆ అధికారిని తప్పుదోవ పట్టిస్తుండడంతో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య విభాగంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు ఎన్విరాన్మెంట్ ఏఈ స్వామిదే బాధ్యత. తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకుని ఈ విభాగాన్ని చక్కదిద్దాలి. పారిశుధ్య విభాగంలో కార్మికుల సమస్యలను పరిష్కరించి తొలగించినవారిని విధుల్లోకి తీసుకోకుంటే సమ్మెబాట పట్టవలసి ఉంటుంది.

# భూసేకరణకు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..?


అమరావతి, జూలై 15, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మౌనంగా ఉంటున్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. తెలుగుదేశం పార్టీకి తొత్తుగా మారారంటూ వైసీపీ నేతలు విమర్శించవచ్చు గాక. కానీ ప్రజాసమస్యలను గుర్తించి వెంటనే స్పందిస్తారని మరోసారి రుజువయింది. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి రావడంతో పాటు వెనక్కు తగ్గినట్లు తెలిసింది. అందుకు కారణం పవన్ కళ్యాణ్ మంత్రి వర్గ సమావేశంలోనే సున్నితంగా తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారంటున్నారు. జనంనాడి పట్టి వెళ్లాలని, అలాగే ప్రత్యర్థుల చేతికి అనవసరంగా ఆరోపణలు చేసేందుకు అవకాశమివ్వకూడదన్న పవన్ అభిప్రాయంతో చంద్రబాబు కూడా ఏకీభవించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతికి మరో ముప్పయి వేల ఎకరాలు అదనంగా రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. తొలి దశలో ఇరవైవేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములను సేకరించాలని నిర్ణయించారు. భూ సమీకరణ జరిపే గ్రామాల్లో గ్రామ సభలను కూడా అధికారులు నిర్వహించారు. అయితే ఇప్పటి వరకూ సేకరించిన భూములకు సంబంధించి ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వలేదని, కొత్తగా మళ్లీ భూసమీకరణ ఎందుకూ రైతులు కొంత వ్యతిరేకించారు. తొలిదశలో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చిన భూములకు ఇంకా రైతులకు కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లు ఇవ్వకుండానే మళ్లీ మొదలు పెడితే ఎలా అని గ్రామసభల్లో రైతులు అధికారులను సూటిగా ప్రశ్నించారు. తాము ఇవ్వబోమంటూ కొందరు పవన్ కళ్యాణ్ ను కూడా కలిశారు. నిర్మొహమాటంగా చెప్పడంతో... అయితే ఇదే విషయాన్ని పవన్ కళ్యాణ్ మంత్రి వర్గ సమావేశంలో నిర్మొహమాటంగా చెప్పినట్లు తెలిసింది. తొలుత తీసుకున్న ముప్పయి ఏడు వేల ఎకరాలకు సంబంధించి భూమిని అభివృద్ధి చేయకుండానే మరోసారి ల్యాండ్ పూలింగ్ అంటూ వెళితే రైతుల్లో కూడా నమ్మకం కలగడం లేదని, తాము ఇప్పటికే తొలిదశలో భూములు ఇచ్చి పదేళ్లు దాటుతున్నా తాము కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని, కనీసం తమకు ప్లాట్లు ఇస్తే వాటిని విక్రయించుకునైనా పిల్లల పెళ్లిళ్లు చేస్తామని ఆవేదన చెందారు. ఇదే విషయాన్ని పవన్ కళ్యాణ్ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా సేకరించాల్సిన భూమి విషయంలో పునరాలోచించుకుంటే మంచిదని సూచించారు. గతంలో కూడా హోం శాఖపై ఆయన చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో మహిళలను కించపరుస్తూ పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నార... అదనపు భూసమీకరణపై విపక్షాల నుంచి ప్రజల నుంచి కూడా వ్యతిరేకత వస్తుందని, అది వైసీపీకి అడ్వాంటేజీగా మారే అవకాశముందని, ఆ అవకాశం ఇవ్వకూడదని పవన్ మంత్రివర్గ సమావేశంలోనే అభిప్రాయపడినట్లు తెలిసింది. ఇందుకు నాదెండ్ల మనోహర్ కూడా ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, బలవంతపు భూ సమీకరణ చేయవద్దని కోరినట్లు తెలిసింది. దీనికి తోడు అదనపు భూ సమీకరణపై కనీసం మిత్ర పక్షాలతో మాట మాత్రమైనా చెప్పకుండా, కూటమిలోని మిగిలిన పార్టీల అభిప్రాయం తెలుసుకోకుండా మంత్రులు ప్రకటన చేయడాన్ని కూడా పవన్ తప్పుపట్టినట్లు తెలిసింది. దీంతోనే అదనపు భూ సమీకరణ విషయంలో కొన్నాళ్లు ఆగాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం మీద ఏడాది కాలంలో తొలిసారి ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రివర్గ సమావేశంలో పవన్ తప్పుపట్టినట్లయిందని జనసేన నేతలే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.గోవా గవర్నర్గా నియమించడం ఆనందంగా ఉందని అశోక్ గజపతి రాజు అన్నారు. పైడితల్లి అమ్మవారి దీవెనలు అనుకుంటున్నానని తెలిపారు. దేశానికి సేవ చేసే అవకాశం లభించిందని అశోక్ గజపతి రాజు తెలిపారు. తాను గవర్నర్ గా నియమితులవుతానని ఊహించలేదని, కానీ తన పేరు ఖరారు కావడం ఆనందంగా ఉందని అశోక్ గజపతి రాజు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తన పేరును ప్రతిపాదించడం.. కేంద్రం ఆమోదించడం చాలా సంతోషంగా ఉందని అశోక్ గజపతి రాజు అన్నారు. మోదీ ప్రధాని కాకపోతే, చంద్రబాబు సీఎం కాకపోతే.. తనకు ఈ గవర్నర్ పదవి వచ్చేది కాదన్న ఆయన గోవా వేరీ ప్రోగ్రెసివ్ స్టేట్ అని గవర్నర్ పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు అశోక్ గజపతిరాజు ధన్యవాదాలు తెలిపారు.

# కనిపించని చంద్రబాబు మార్క్..

విజయవాడ, జూలై 15, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద పెద్ద భారం ఉంది. చంద్రబాబుపై పెట్టుకున్న నమ్మకానికి ఈ టర్మ్ అసలైన సమయమని విశ్లేషకులు సయితం అభిప్రాయపడుతున్నారు. 1995 నుంచి 2004 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆయన అభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి పదవిని నిలుపుకోగలిగారు. తనకు తానే ముఖ్యమంత్రిని కానని, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అని ప్రకటించుకున్నారు. ఇక ఆకస్మిక తనిఖీల పేరుతో అధికారులను హడలెత్తించారు. చంద్రబాబుకు గ్లామర్ లేదు. కానీ తన రాజకీయ చాణక్యంతో పలు మార్లు ఒంటిచేత్తో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేగలిగారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని తన చేతుల్లోకి తీసుకున్నా కార్యకర్తలను, నందమూరి కుటుంబ సభ్యులను ఒప్పించి మెప్పించగలిగారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత నూతన ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టారు. ఆయనను ప్రజలు ఎంచుకున్నది కూడా ఆయన నాయకత్వం.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్న నమ్మకమే. అందుకే ప్రజలు గెలిపించారు. 2014 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పటికీ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. అందుకు తగిన సమయం లేదని ఆయన చెప్పిన కారణాన్ని జనం నమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే హైదరాబాద్ నుంచి రాజధానిని అమరావతికి తరలించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసినా అనేక కారణాలతో జాప్యం జరగడంతో ప్రజలు కూడా చంద్రబాబు చెప్పిన మాటలను విశ్వసించారు. ఇప్పుడు చంద్రబాబు మరోసారి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. అయితే చంద్రబాబు మార్క్ పాలన ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదన్న అభిప్రాయం ప్రజల్లో కనపడుతుంది. సంక్షేమ కార్యక్రమాలను ఆలస్యంగా అమలు చేయడమే కాకుండా అభివృద్ధి పనులను కూడా వేగంగా చేయకపోవడంతో కొంత భిన్నమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొత్తగా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేరెన్నిక గన్న పరిశ్రమలు ఏపీకి రాలేదు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయినా అవి పూర్తవుతాయో లేదో తెలియడం లేదు. ఎందుకంటే సరైన వాతావరణ పరిస్థితులు కనిపించడం లేదు. దీనికి తోడు మళ్లీ అదనంగా ఇరవై వేల ఎకరాల భూమిని సేకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా ఎవరూ హర్షించడం లేదు.. ఏడు పదులు దాటిన వయసులోనూ ఆయన ఇప్పటికీ కష్టపడుతున్నారు. కంపెనీలు రాక కోసం అనేక పర్యటనలు చేస్తున్నారు. ఢిల్లీకి వరసబెట్టి తిరుగుతున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి సింగపూర్ పర్యటనకు కూడా వెళుతున్నారు. పరిశ్రమల స్థాపన కోసం ఆయన ఐదు రోజుల పాటు సింగపూర్ లోనే ఉంటారు. రేపు ఢిల్లీకి వెళుతున్నారు. రెండు రోజులు అక్కడే ఉండి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజక్టులు, నిధులు గురించి ప్రయత్నం చేయడానికే ఢిల్లీకి వెళుతున్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతి రాజధాని మొదటి దశ పనులు 2028 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే పక్కా ప్రణాళికతో వెళుతున్నప్పటికీ అనుకోని అవాంతరాలు ఈసారి కూడా ఆయన అనుకున్నది నెరవేరుతుందా? లేదా? అన్న అనుమానం అందరిలోనూ ఉంది. మరి చంద్రబాబు ఈ గండం నుంచి ఎలా బయటపడతారన్నది చూడాలి.

# పదవికి వన్నె తెచ్చే గజపతిరాజు...

విజయనగరం, జూలై 15,మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు అనుకున్నట్లే గవర్నర్ పదవి లభించింది. దేశంలో మొత్తం మూడు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హర్యానా గవర్నర్ గా ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ గా రకవీందర్ గుప్తా, గోవా గవర్నర్ గా పూసపాటి అశోక్ గజపతి రాజును నియమించారు. దీంతో మరో తెలుగు గవర్నర్ బండారు దత్తాత్రేయను మరో రాష్ట్రానికి గవర్నర్ గా నియమిస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఇంద్రసేనారెడ్డితో పాటు ఏపీకి చెందిన కంభంపాటి హరిబాబులు గవర్నర్ లుగా ఉన్నారు. అంటే తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు గవర్నర్లకు మాత్రమే అవకాశం ఉందా? అన్న సందేహం కలుగుతుంది.పూసపాటి అశోక్ గజపతి రాజు అందరికీ సుపరిచితులే. గత ఎన్నికల్లో ఆయనకు విజయనగరం ఎంపీ టిక్కెట్ ఇవ్వకుండా ఆయన కుమార్తె ఆదితి గజపతి రాజుకు విజయనగరం ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినప్పుడే రాజుగారు గవర్నర్ అవుతారన్న ప్రచారం మొదలయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం తర్వాత పూసపాటి అశోక్ గజపతి రాజు గవర్నర్ గా నియమితులైయ్యారు. పెద్దాయన అంటే పార్టీలో అందరికీ గౌరవమే. నీతికి నిజాయితీకి పేరు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నేత అశోక్ గజపతి రాజు అనేక సార్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో మంత్రిగా చేసినా ఎటువంటి ఆరోపణలు ఆయనపై రాలేదు. నిక్కచ్చిగా ఉండే నేతల్లో అశోక్ గజపతి రాజు ఒకరు.ప్రస్తుతమున్న రాజకీయాల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుని డిసైడ్ అయి తన వారసురాలిని పొలిటిక్స్ లోకి దించారు. అశోక్ గజపతి రాజు చంద్రబాబు నాయుడుతో సమానమైన రాజకీయ అనుభవం ఉన్న నేత. విజయనగరం జిల్లా అంటేనే టీడీపీలో మొదట గుర్తొచ్చేది ఆయన పేరే. అలాంటిది అశోక్ గజపతి రాజు ఎటువంటి పదవి లేకుండా ఏడాది నుంచి కోటలోనే పరిమితమవుతుండటం ఆయనను అభిమానించే వారికి మనస్తాపం కలిగించేదే. ఆయన ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే ఉంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన ట్రస్ట్ విషయంలోనూ ఇబ్బంది పెట్టింది. న్యాయస్థానాలకు వెళ్లి పోరాడాల్సి వచ్చింది.టీడీపీలో సీనియర్ నేతలను పక్కన పెట్టాల్సి రావడం, యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సి రావడంతో ఆయనకు గత ఎన్నికల్లో టిక్కెట్ నాయకత్వం ఇవ్వలేదు. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుండటంతో సీనియర్ నేత అయిన అశోక్ గజపతి రాజును గవర్నర్ గా నియమిస్తారని ఎప్పటి నుంచో ప్రచారం జరిగింది. పూసపాటి అశోక్ గజపతి రాజు కూడా తనకు రావాల్సిన సమయంలోనే వస్తుందని, అప్పటి వరకూ వెయిట్ చేయడమే తప్ప ఏం చేయలేమని గ్రహించిన రాజుగారు ఏడాది కాలం నుంచి మౌనంగానే ఉంటున్నారు. 1951లో జన్మించిన అశోగ్ గజపతిరాజు గ్వాలియర్ లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదువుకున్నారు. మంచి భావాలు కలిగిన నేతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబు కేబినెట్ లో క్షత్రియ సామాజికవర్గానికి మంత్రి పదవి దక్కనప్పుడు కూడా పూసపాటి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి ఖాయమని అనుకున్నారు. ఈలోపు డిప్యూటీ స్పీకర్ గా రఘురామ కృష్ణరాజును నియమించడంతో క్యాబినెట్ ర్యాంక్ కావడంతో ఇక అశోక్ గజపతి రాజుకు గవర్నర్ గిరీ రాదేమోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కానీ అందరి ఆలోచనలు పటాపంచలు చేస్తూ ఆయన గవర్నర్ గా నియమిస్తూ విజయనగరం జిల్లా?లోనే కాకుండా రాష్ట్రంలోని టీడీపీ అభిమానులందరూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



# కలకలం రేపుతున్న విజయిసాయి ట్వీట్

విజయవాడ, జూలై 15, నేను రాజకీయాలకు దూరంగా ఉన్నానేమో కానీ రాజకీయం మాత్రం నా నుంచి దూరంగా లేదు" అంటూ అప్పట్లో చిరంజీవి చెప్పిన డైలాగ్ ఇప్పుడు విజయసాయిరెడ్డికి కరెక్ట్‌గా సరిపోతుంది. తనకు ఈ రాజకీయాలు వద్దు వ్యవసాయం చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయి ఆరు నెలలు దాటింది. అయినా సరే ఆయనను మాత్రం రాజకీయాలు వదలడం లేదు. ఏదో రూపంలో రాజకీయాల్లో ఆయన పేరు వినిపిస్తూనే ఉంది. ఈ మధ్య కాలంలో మరింత ఎక్కువైంది. వీటికి తోడు ఆయన చేసిన ట్వీట్ మరింత ఆసక్తిని రేపుతోంది. విజయసాయిరెడ్డి ట్వీట్ చూస్తే మాత్రం ఆయన రాజకీయ రంగ పునఃప్రవేశానికి రెడీ అయినట్టు స్పష్టమవుతోంది. అయితే ఏ పార్టీలోకి వెళ్తారు ఆయనకి ఉన్న ఆప్షన్స్ ఏంటో ఒక్కసారి పరిశీలిస్తే... విజయసాయిరెడ్డి వైసీపీలోకి



రావాలని ఓ వర్గం నేతలు బలంగా కోరుకుంటున్నారు. ఈ మధ్య వైసీపీ సోషల్ మీడియాలో కూడా విజయసాయి రెడ్డి రీ ఎంట్రీపై చర్చ సాగింది. దీన్ని కొందరు స్వాగతిస్తుంటే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. వైసీపీలోకి విజయసాయిరెడ్డి వస్తే ప్రత్యర్థులకు చుక్కలే అంటూ కూడా కొందరు కామెంట్ చేశారు. దీన్ని వ్యతిరేకించిన వాళ్లు కూడా అదే రేంజ్‌లో ఉన్నారు. ఆయన్ని నమ్మే పరిస్థితిలో జగన్ లేడనే వాళ్లు లేకపోలేదు. అయితే వైసీపీ అధినాయకత్వంపై విజయసాయిరెడ్డి ఘాటుగానే విమర్శలు చేశారు. సజ్జల, వైవి సుబ్బారెడ్డిన టార్గెట్ చేస్తూ ఆరోపణలు గుప్పించారు. జగన్‌పై ఎలాంటి విమర్శలు చేయకపోయినప్పటికీ వారి మాటలు విని తనపై ద్వేషం పెంచుకున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ని మళ్లీ వైసీపీ అక్కున చేర్చుకుంటుందా అనేది అనుమామే. అయితే ఇంతకంటే దారుణంగా మాట్లాడిన వాళ్లనే జగన్ అక్కున చేర్చుకొని మంత్రిపదవులు ఇచ్చారని వారితో పోల్చుకుంటే విజయసాయిరెడ్డి చాలా బెటర్ అంటున్నారు. బొత్స, ధర్మాన ప్రసాదరావు, వంశీ లాంటి వాళ్లను గుర్తు చేస్తున్నారు.ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానించినా మిగతా నాయకులతో పొసగడం అంత ఈజీ కాదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారిపై విమర్శలు చేసిన వ్యక్తి ఇప్పుడు వారితో కలిసి పని చేసే పరిస్థితి ఉంటుందా అనేది అనుమానే అంటున్నారు. ఆయన స్థాయికి తగ్గట్టు ఉండదని భవిష్యత్‌లో ఎలాంటి పదవుల్లో కూడా ప్రాధాన్యత ఉండకపోవచ్చనే మాట గట్టిగా వినిపిస్తోంది. అందుకే అలాంటి ఆలోచన విజయసాయిరెడ్డి చేయకపోవచ్చని మాట బలంగా వినిపిస్తోంది. రెండో ఆప్షన్ బీజేపీ. విజయసాయిరెడ్డికి బీజేపీ అధినాయకత్వం వద్ద మంచి పలుకుబడే ఉంది. వైసీపీతో పోల్చుకుంటే బీజేపీ నేతలతో ఎలాంటి విభేదాలు లేవు. కేవలం రాష్ట్రంలో టీడీపీ, జనసేన నేతలు మాత్రమే అభ్యంతరం చెప్పే అవకాశం ఉంది. ఢిల్లీ నుంచి నెల్లూరు బీజేపీ వరకు అందరూ ఆయన్నిఆహ్వానించే వాళ్లే అంటున్నారు. ఉన్న రెండు ఆప్షన్స్‌లో దీనికే విజయసాయిరెడ్డి మొగ్గు చూపుతారని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భగవద్గీత శ్లోకం చెప్పిన విజయసాయి రెడ్డి బీజేపీలోకి వెళ్తున్నట్టు హింట్ ఇచ్చారనే వారు ఉన్నారు. ప్రతిపక్షంతోపాటు అన్ని రాజకీయా పార్టీలు రాజధర్మాన్ని పాటించాలనే స్టేట్మెంట్‌తో తన ట్వీట్ ప్రారంభించారు. కర్మణ్యే వాధికారస్తే అనే శ్లోకంతో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కర్మలను ఆచరించడంపైనే అధికారము ఉంటుందని వాటి ఫలితాలపై ఉండదని చెప్పుకొచ్చారు. ఆ ఆ ఫలితాలకు కారణం కాకూడదని అలాగనే పనులు చేయకుండా ఉండొద్దని అన్నారు. ఇది కచ్చితంగా తన పొలిటికల్ రీ ఎంట్రీపై ఇచ్చిన హింటే అంటున్నారు అభిమానులు. ఈ ట్వీట్‌పై మరో వాదన కూడా వినిపిస్తోంది. లిక్కర్ కేసులో విజయసాయిరెడ్డిని మరోసారి సిట్ పిలిచింది. దానిని ఉద్దేశించే పెట్టి ఉంటారని అంటున్నారు. సిట్ విచారణ ఫలితం ఎలా ఉన్నా సరే నీకు తెలిసింది చెప్పి రావడం ధర్మం అనే యాంగిల్‌లో ఈ ట్వీట్‌ను డీ కోడ్ చేస్తున్నారు మరికొందరు. ఏమైనా సరే విజయసాయిరెడ్డి మాత్రం ఒక్క ట్వీట్‌తో అందరి బుర్రలకు పని చెప్పారు. ఆయన సీఏ బుర్రలో ఏముందో తెలియదు కానీ దాన్ని డీ కోడ్ చేసే పని మాత్రం సోషల్ మీడియాకు ఇతరులకు ఇచ్చేశారు. దీనిపై ఎవరు ఎన్ని విశ్లేషణలు చేసినా సిట్ విచారణకు వచ్చినప్పుడు ఆయన చెప్పే విషయాల కోసం మరికొందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఆర్టీసీ టిక్కెట్లపై 100 వరకు తగ్గింపు

అనంతపురం, జూలై 15 ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు బంపరాఫర్ ప్రకటించింది.. బస్ ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అనంతపురం నుంచి కొన్ని ప్రధాన నగరాలకు వెళ్లే బస్సులు ఛార్జీలను తగ్గించారు. ఈనెల 31 వరకు తగ్గింపు ఛార్జీలు అమల్లో ఉంటాయని.. వెన్నెల ఏసీ, స్లీపర్ బస్సుల్లో 20 శాతం, ఇంద్ర బస్సులకు 15 శాతం ఛార్జీలు తగ్గించినట్లు తెలిపారు. అనంతపురం నుంచి హైదరాబాద్, చెన్నై, తిరుపతి, విజయవాడకు ఈ ఛార్జీలు తగ్గించామన్నారు. అనంతపురం నుంచి వెళ్లడంతో పాటుగా తిరుగు ప్రయాణంలో కూడా ఈ ఛార్జీలు వర్తిస్తాయన్నారుతాడిపత్రి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు గతంలో బస్ ఛార్జీ రూ.1105 ఉంటే.. తాజాగా ఆ రేటు రూ.884కు తగ్గించారు. అలాగే అనంతపురం నుంచి విజయవాడ వెళ్లేందుకు గతంలో రూ.961 ఉంటే.. తాజాగా రూ.817కు తగ్గించారు. అనంతపురం నుంచి చెన్నైకు గతంలో రూ.832 ఉంటే.. తాజాగా దానిని రూ.708కు తగ్గించారు. అనంతపురం నుంచి తిరుపతికి గతంలో రూ.579 ఉంటే.. తాజాగా ఆ ధరను రూ.493కు తగ్గిస్తూ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అంటే ఒక్కో రూట్‌లో రూ.100 నుంచి రూ.150 వరకు ఛార్జీలను తగ్గించింది ఆర్టీసీప్రైవేటుకు దీటుగా ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకొనే క్రమంలో వెళ్లేందుకు ఛార్జీలను తగ్గించినట్లు ఆర్ఎం సుమంత్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఆషాఢమాసం కావడంతో పెద్దగా ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో.. ఆర్టీసీకి ఆదాయం పెంచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నామన్నారు. ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఊరట లభించింది అని చెప్పాలి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.అనంతపురం మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని ఆయా డిపోల్లో బస్ ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏసీ బస్సుల్లోనే ఎక్కువశాతం ఛార్జీలను తగ్గించారు. ఆ డిపోలో నుంచి హైదరాబాద్ సహా ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల టికెట్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

# వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద బొబ్బిలి వీణ

విజయనగరం, జూలై 15, చారిత్రక బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద బొబ్బిలి వీణ ఎంపిక అయ్యింది. ఈ అవార్డును విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జులై 15న ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జరిగే కార్యక్రమంలో అందుకోనున్నారు.బొబ్బిలి వీణ సరస్వతి వీణగా ప్రసిద్ధి గాంచింది. ఈ సంగీత వాద్యాన్ని దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ గౌరవంగా చూస్తారు. వీణ నిర్మాణంలో ఉపయోగించే పనస మరియు సంపంగి చెక్కలతో తయారుచేయడం ఈ వీణ యొక్క ప్రత్యేకత. ఇక్కడ తయారయ్యే గిఫ్ట్ వీణలు కూడా విశేషంగా ఆదరణ పొందుతున్నాయి. వీటిని జ్ఞాపికలుగా ప్రసిద్ధ వ్యక్తులకు బహూకరించడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. బొబ్బిలి వీణ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక గౌరవాలను సంపాదించింది. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ వీణను చూసి అభినందించగా, జి-20 సదస్సు, విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ వంటి ముఖ్యమైన కార్యక్రమాల్లో వీణ ప్రదర్శనలు ప్రపంచానికి పరిచయం అయ్యాయి. బొబ్బిలి వీణ చిత్రంతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రించబడ్డాయి. వీణలు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కూడా ఎగుమతి అవుతుండటంతో ఈ హస్తకళకు మంచి మార్కెట్ ఏర్పడింది.వీణ తయారీ ప్రధానంగా బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లి గ్రామంలో జరుగుతుంది. ఈ గ్రామంలోని దాదాపు పలు కుటుంబాలు బొబ్బిలి రాజుల కాలం నుంచి వీణ తయారీలో నిమగ్నమై జీవనం కొనసాగిస్తున్నాయి. గతంలో వీణ తయారీకి వినియోగించే పనస కలప కొరత ఏర్పడిన నేపథ్యంలో కలప కొరతను అధిగమించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనస చెట్ల సాగును పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది ఈ కళను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. ఓడీఓపీ కింద లభించిన ప్రస్తుత గుర్తింపు బొబ్బిలి వీణ ఖ్యాతిని దేశవ్యాప్తంగా మరింతగా పెంచనుంది. సంస్కృతి, సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉన్న బొబ్బిలి వీణ, భారతీయ కళా సంపదకు గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. ఇప్పుడు ఓడీఓపీ అవార్డు రూపంలో వచ్చిన ఈ గౌరవం, ఈ కళను భవిష్యత్ తరాలకి మరింత చేరువ చేయనుంది.

# ఏపీలో వారందరికి సంక్షేమ పథకాలు కట్..



విశాఖపట్టణం, జూలై 15, ఏపీలో వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలిపివేసే ఆలోచనలో ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారికి పథకాలు రావన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గతంలో 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని, ప్రస్తుతం అది 90 ఎకరాలకు తగ్గిందని వివరించారు. గిరిజనులకు ఉపాధి కల్పించడానికి పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించామని ఆమె పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం త్వరలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారందరికి సంక్షేమ పథకాలను నిలిపివేసే ఆలోచనలో ఉందన్నారు హోంమంత్రి వంగలపూడి అనిత. ఇకనైనా పద్దతి మార్చుకుంటే బావుంటుందని వార్నింగ్ ఇచ్చారు. అనవసరంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. హోంమంత్రి అనిత, ఈగల్ ఐజీ రవికృష్ణ అమరావతి సచివాలయంలో మాట్లాడారు.. కీలక వ్యాఖ్యలు చేవారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని.. ఆ దిశగా మార్చడానికి కృషి చేస్తున్నామని.. గంజాయి కేసులో పట్టుబడిన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలిపివేసే ఆలోచనలో ఉంది అన్నారు. గంజాయి సాగును అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. గిరిజనులకు ఉపాధి కల్పించడానికి పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.రాష్ట్రంలో గంజాయి సాగును తగ్గించామన్నారు హోంమంత్రి అనిత. గతంలో 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేది.. ఇప్పుడు అది 90 ఎకరాలకు తగ్గిందని వివరించారు. త్వరలోనే గంజాయి సాగును పూర్తిగా నివారిస్తామని.. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది అన్నారు. ఈ ఏడాది 2 కోట్ల పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. 'గత ఏడాది కాలంలో 831 కేసుల్లో 2,114 మందిని అరెస్టు చేశాము. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు 23,770 కిలోల గంజాయి, 27 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. 293 వాహనాలను సీజ్ చేశారు. అలాగే గంజాయి సాగును ప్రోత్సహిస్తున్న ఏడుగురికి చెందిన దాదాపు రూ.7.75 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశాము' అని హోంమంత్రి అనిత వివరించారు.

# మెదడును శక్తివంతంగా మార్చే సూపర్ ఫుడ్ ఇదొక్కటే.. గుజరాతోళ్లను మించిన తెలివితేటలు!




మన మెదడు శరీరంలోని అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ఇది మానసిక సామర్థ్యాన్ని, గుర్తింపు శక్తిని, ఏకాగ్రతను, మెమరీ పవర్‌ను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం తినడం మెదడు పనితీరును మెరుగుపరచడానికి చాలా అవసరం. కొన్ని ప్రత్యేకమైన ఆహార పదార్థాలు మెదడు అభివృద్ధికి సహాయపడతాయి. మిగిలిన శరీర అవయవాల మాదిరిగానే మెదడుకూ పోషకాహారం ఎంతో ముఖ్యం. ఇటీవల హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఒక సంచలన విషయాన్ని వెల్లడించింది. ప్రతిరోజూ మనం వంటల్లో వాడే ఒక సాధారణ పదార్థం మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు (డిమెన్షియా) ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుందని తెలిపింది. ఆ అద్భుతమైన పదార్థం మరేదో కాదు, మనందరికీ తెలిసిన 'ఆలివ్ ఆయిల్'. ఆలివ్ ఆయిల్ - మెదడుకు వరం: 2024లో హార్వర్డ్ నిర్వహించిన అధ్యయనంలో, రోజుకు కనీసం 7 గ్రాముల ఆలివ్ ఆయిల్ తీసుకునే వారిలో మతిమరుపుతో వచ్చే మరణాల ప్రమాదం 28 శాతం తగ్గిందని తేలింది. జన్యుపరమైన కారణాలు, ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నప్పటికీ, ఆలివ్ ఆయిల్ క్రమం తప్పకుండా తీసుకునే వారిలో ఈ ఫలితం కనిపించింది. ఆలివ్ ఆయిల్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులోని కణాల నిర్మాణాన్ని, పనితీరును మెరుగుపరుస్తాయి.దీనిలో పాలీఫెనాల్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మెదడులో మంటను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. జ్ఞానాన్ని మెరుగుపరుస్తుంది, వయస్సుతో వచ్చే జ్ఞాపకశక్తి క్షీణతను నివారిస్తుంది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధుల నుండి రక్షిస్తుంది. మెదడుకు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది, రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది: ఇవే కాకుండా, ఆలివ్ ఆయిల్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శక్తిని పెంచుతుంది, ఆకలిని నియంత్రిస్తుంది, హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది, చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. వ్యాధి నివారణ, దీర్ఘాయువులో నిపుణుడైన వైద్య నిపుణులు సోగోల్ యాష్, మెదడు ఆరోగ్యానికి మధ్యధరా ఆహారం చాలా మంచిదని చెబుతారు. ఆలివ్ ఆయిల్ ఈ ఆహారంలో ఒక ముఖ్యమైన భాగం. ఏలా తినాలి?: ప్రతిరోజూ ఉదయం లేదా మధ్యాహ్నం 1-2 టేబుల్ స్పూన్ల నాణ్యమైన, కోల్డ్-ప్రెస్డ్ ఎక్స్ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ తాగవచ్చు. రుచి కోసం నిమ్మరసం లేదా పసుపు కలపవచ్చు.ఏదోసకాయ ముక్కలపై ఆలివ్ ఆయిల్, నిమ్మరసం, ఉప్పు వేసి తినవచ్చు. సలాడ్‌లలో ఆలివ్ ఆయిల్‌ను డ్రెస్సింగ్‌గా ఉపయోగించవచ్చు. చేపలు, కూరగాయలు వేయించిన తర్వాత ఆలివ్ ఆయిల్ వేసి తినవచ్చు. ఆలివ్ ఆయిల్‌ను పచ్చిగా తీసుకోవడం వల్ల దానిలోని పాలీఫెనాల్స్ పూర్తిగా అందుతాయి. ఆలివ్ ఆయిల్‌ను తక్కువ ఉష్ణోగ్రతలో (350ళీఈ లేదా అంతకంటే తక్కువ) వంట చేయడానికి ఉపయోగించాలి. ఎక్కువ వేడిలో వండకూడదు. ఆలివ్ ఆయిల్ తీసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన వ్యాయామం, మంచి నిద్రతో పాటు మంచి ఆహారం తీసుకుంటే మెదడు ఆరోగ్యంగా ఉంటుందని గుర్తుంచుకోవాలి. ప్రతిరోజూ ఆలివ్ ఆయిల్‌ను ఆహారంలో చేర్చుకోవడం వల్ల మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# డిన్నర్ తర్వాత ఇది ఒక్కటి తీసుకుంటే చాలు.. పూర్వీకుల్లా బలంగా ఉంటారు.!

యాలకులు భారతీయ ఆహార సంస్కృతిలో ఒక ముఖ్యమైన మసాలా పదార్థం. దీనిని వంటల్లో ఉపయోగించడంలోనే కాదు, ఆయుర్వేదంలోనూ అధిక ప్రాముఖ్యత ఉంది. యాలకులు తియ్యటి సువాసనతో పాటు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత ఒకటి లేదా రెండు యాలకులు నమిలితే శరీరానికి అనేక లాభాలు కలుగుతాయి. జీర్ణ వ్యవస్థకు మేలు యాలకుల్లో ఉన్న నేచురల్ ఆయిల్స్ జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వలన అజీర్ణం, కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. ఇందులోని యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. భోజనం తర్వాత ఆసిడ్ రిఫ్లక్స్ సమస్య ఎక్కువగా వస్తుంది. యాలకులు మైదాన గ్రంథులను ఉత్తేజపరిచి కడుపులో ఆసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. రక్త పోటు నియంత్రణ యాలకులు నాచురల్ డయూరెటిక్‌గా పనిచేసి అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఇది శరీరంలో సోడియం నిల్వలను నియంత్రించడంలో సహాయపడుతుంది. యాలకుల్లో న్యూట్రియంట్స్ మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే గుణాలు కలిగి ఉంటాయి. ఇది ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను అందిస్తుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు తీసుకోవడం వల్ల గాఢ నిద్రకు సహాయపడుతుంది. శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం యాలకుల్లో యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉండటంతో శ్వాస సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి. రాత్రి పూట దీన్ని తీసుకోవడం వలన జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. దీనిలోని యాంటీ-ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. చర్మ ఆరోగ్యానికి మేలు యాలకులు డిటాక్సిఫైయింగ్ గుణాలను కలిగి ఉండటంతో శరీరంలోని విషతత్వాలను తొలగించడంలో సహాయపడతాయి. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచి, మొటిమలు, మురికి నుంచి రక్షణ ఇస్తుంది.దీనిలోని మటాబాలిజాన్ని పెంచే గుణాన్ని కలిగి ఉంటాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, కొవ్వును త్వరగా కరిగించుకోవడానికి సహాయపడుతుంది. యాలకులు ప్రాకృతిక మూత్రవిసర్జక గుణాలను కలిగి ఉంటాయి. ఇది మూత్రాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచి మూత్ర సంబంధిత ఇబ్బందులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఎలా తినాలి? భోజనం తర్వాత ఒకటి లేదా రెండు యాలకులు నేరుగా నమిలి తినవచ్చు. గోరువెచ్చని నీటితో లేదా పాలతో కలిపి తాగవచ్చు. యాలకులను పొడి చేసి తేనెతో మిక్స్ చేసి తీసుకోవచ్చు.

# నిద్రలేని రాత్రులు వేధిస్తున్నాయా? ఒక్క గ్లాసు ఇది తాగితే చాలు..తుర్రున గుర్రు పెడతారు!

పసుపు పాలు, దీనిని "గోల్డెన్ మిల్క్" అని కూడా పిలుస్తారు, ఇది ఒక సాంప్రదాయ భారతీయ పానీయం, ఇది శతాబ్దాలుగా దాని ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందింది. పసుపును పాలలో మరిగించి తయారు చేస్తారు, తరచుగా అల్లం, దాల్చినచెక్క , నల్ల మిరియాలు వంటి ఇతర సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. ఈ పానీయం రాత్రిపూట నిద్రకు ముందు తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మెరుగైన నిద్ర: పసుపులో కర్కుమిన్ అనే క్రియాశీల సమ్మేళనం ఉంటుంది, ఇది శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది, ఇది తరచుగా నిద్రలేమికి కారణమవుతుంది. పసుపు పాలు మెదడును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్,యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. పసుపు పాలు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జలుబు, ఫ్లూ , ఇతర ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు. జీవితాంతం నా చెయ్యి పట్టుకొనే.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: పసుపు పిత్త ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, ఇది కొవ్వులను జీర్ణం చేయడానికి అవసరం. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో , మలబద్ధకం, ఉబ్బరం మరియు గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపులోని కర్కుమిన్ సహజ నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. ఇది కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు మరియు తలనొప్పి వంటి దీర్ఘకాలిక నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది.

# ప్లాస్టిక్ కప్‌లో వేడి వేడిగా టీ తాగుతున్నారా? అయితే యమలోకానికి సిద్ధం కావాల్సిందే!


ప్లాస్టిక్ కప్‌లో టీ తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందనే వాదనకు మద్దతు ఇవ్వడానికి పరిమిత శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి. అయినప్పటికీ, ప్లాస్టిక్ కప్పుల నుండి వేడి పానీయాలు తాగడం గురించి కొన్ని ఆందోళనలు ఉన్నాయి, ఎందుకంటే వేడి ప్లాస్టిక్‌లోని రసాయనాలు ద్రవంలోకి లీక్ అయ్యేలా చేస్తుంది.ప్లాస్టిక్‌లలో రసాయనాలు: ప్లాస్టిక్ కప్పులను తయారు చేయడానికి ఉపయోగించే కొన్ని రసాయనాలు, బిస్ ఫినాల్ ఎ (బిపిఎ) మరియు థాలేట్స్ వంటివి, హార్మోన్ల అంతరాయాలుగా గుర్తించబడ్డాయి. ఈ రసాయనాలు శరీరంలోని సహజ హార్మోన్ల పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి, ఇది క్యాన్సర్ సహా వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ప్లాస్టిక్ కప్పు వేడి టీ వంటి వేడి ద్రవంతో నిండినప్పుడు, ప్లాస్టిక్ నుండి రసాయనాలు పానీయంలోకి లీక్ అయ్యే ప్రమాదం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు ఈ లీచింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తాయి. పరిశోధన ఫలితాలు: ప్లాస్టిక్ కప్పుల వాడకం , క్యాన్సర్ ప్రమాదం మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని చూపించే అధ్యయనాలు పరిమితం. అయితే, కొన్ని అధ్యయనాలు ఃఖం వంటి ప్లాస్టిక్‌లలోని రసాయనాలకు గురికావడం వల్ల రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ , ఇతర హార్మోన్-సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం పెరుగుతుందని సూచిస్తున్నాయి. ప్లాస్టిక్ కప్పుల వాడకం క్యాన్సర్ ప్రమాదంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ సమస్యలలో ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, పునరుత్పత్తి సమస్యలు ఉన్నాయి. ప్లాస్టిక్ రకాలు: ప్లాస్టిక్ కప్పులు సాధారణంగా పాలీస్టైరిన్ (స్టైరోఫోమ్), పాలీప్రొఫైలిన్ వంటి వివిధ రకాల ప్లాస్టిక్‌లతో తయారు చేయబడతాయి. పాలీస్టైరిన్ వేడిచేసినప్పుడు స్టైరిన్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది, ఇది క్యాన్సర్ కారకంగా పరిగణించబడుతుంది. పాలీప్రొఫైలిన్ సాధారణంగా సురక్షితమైనదిగా పరిగణించబడుతుంది, అయితే ఇది వేడిచేసినప్పుడు ఇతర రసాయనాలను కూడా విడుదల చేయవచ్చు. ముందు జాగ్రత్తలు: క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి, ప్లాస్టిక్ కప్పులలో వేడి పానీయాలు తాగడం మానుకోవడం మంచిది. బదులుగా, గాజు, సిరామిక్ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి ఇతర పదార్థాలతో చేసిన కప్పులను ఉపయోగించడం మంచిది. ప్లాస్టిక్ కప్పులో టీ తాగాలా వద్దా అనేది వ్యక్తిగత ఎంపిక. ప్లాస్టిక్ కప్పుల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి మీరు ఆందోళన చెందుతుంటే, ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం మంచిది.



# దోసకాయలను కట్ చేసినప్పుడు విత్తనాలను పడేయకండి.. వాటితో ఎన్నో లాభాలు

। మనకు మార్కెట్‌లో రెండు రకాల దోసకాయలు లభిస్తాయన్న సంగతి తెలిసిందే. కీరదోసతోపాటు కూర దోస కాయలు కూడా మనకు లభిస్తాయి. అయితే కీరదోసలో ఉండే విత్తనాలు చాలా పలుచగా ఉంటాయి. కనుక వీటిని ప్రత్యేకంగా సేకరించి తినలేం. అదే కూర దోసకాయల్లోని విత్తనాలు అయితే కాస్త మందంగా ఉంటాయి. ఇక చాలా మంది ఈ విత్తనాలను పడేస్తుంటారు. కేవలం దోసకాయను మాత్రమే కూరల్లో వేస్తుంటారు. అయితే వాస్తవానికి దోసకాయ విత్తనాలు కూడా ఎన్నో పోషకాలను కలిగి ఉంటాయి. దోసకాయ విత్తనాలను ఎండ బెట్టి వేయించుకుని తినవచ్చు. సాయంత్రం సమయంలో స్నాక్స్‌కు బదులుగా దోసకాయ విత్తనాలను తింటే రుచికి రుచి, పోషకాలకు పోషకాలు లభిస్తాయి. దోసకాయ విత్తనాలను రోజూ గుప్పెడు మోతాదులో తింటుంటే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు.అధిక బరువు తగ్గవచ్చు..దోసకాయ విత్తనాల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరగుపరుస్తుంది. ఈ విత్తనాలను తింటుంటే పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. దీంతో విరేచనం సాఫీగా అవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. దోసకాయ విత్తనాల్లో చాలా వరకు నీరే ఉంటుంది. అందువల్ల ఈ విత్తనాలను తింటే శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. శరీరం హైడ్రేట్ అవుతుంది. దోస విత్తనాలను తింటుంటే శరీర జీవక్రియలు కూడా సరిగ్గా నిర్వహించబడతాయి. శరీర ఉష్ణోగ్రత క్రమబద్దంగా ఉంటుంది. కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు దోస విత్తనాలను రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఈ విత్తనాల్లో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది.బీపీ తగ్గుతుంది..దోసకాయ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగానే ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా చూసుకోవచ్చు. మన శరీరం క్యాన్సర్, గుండె పోటు వంటి తీవ్రమైన వ్యాధుల బారిన పకుండా దోసకాయ విత్తనాల్లోని యాంటీ ఆక్సిడెంట్లు సహాయం చేస్తాయి. దోస విత్తనాల్లో మెగ్నిషియం, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ విత్తనాల్లో ఉండే మినరల్స్ బీపీని తగ్గిస్తాయి. గుండె సాధారణంగా కొట్టుకునేలా చేస్తాయి.ఎముకల దృఢత్వానికి..దోస విత్తనాల్లో విటమిన్ ఇ, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. విటమిన్ ఇ వల్ల ఫ్రీ ర్యాడికల్స్ కారణంగా దెబ్బ తిన్న చర్మ కణాలు రిపేర్ అవుతాయి. ఫ్యాటీ యాసిడ్ల వల్ల చర్మానికి తేమ లభిస్తుంది. సాగే గుణాన్ని పొందుతుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. దోస విత్తనాల్లో క్యాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ విత్తనాల్లో ఉండే మినరల్స్ ఎముకల సాంద్రతను పెంచుతాయి. దీంతో ఆస్టియోపోరోసిస్ రాకుండా చూసుకోవచ్చు. దోస విత్తనాల్లో జింక్ అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. జింక్ వల్ల తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. ఇవి ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఇలా దోస విత్తనాలను తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.






# ఏఐ ఆధారంగా భగవద్గీత

## ఐదునిముషాల నిడివిలో పూర్తి




ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు- అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు- చెప్పారు. రెండేళు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.



# యానిమల్ లాంటి హీరో తో డేటింగ్

## నటి రష్మిక మందన్న హాట్కామెంట్స్




వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్ధంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'ధామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు- 'ది గర్ల్ రైడ్‌తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ- అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి.

# లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్



అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు-.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.

# పెద్ది నుంచి గౌర్నాయుడు లుక్ విడుదల




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృదం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను 'పెద్ది' చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన 'గౌర్నాయుడు' పాత్రలో కనిపించనున్నారు.

# అవతార్ లాంటి టెక్నాలజీ ప్రవేశ పెడతా : శంకర్



ప్రస్తుతం తన మార్క్ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు డైరెక్టర్ శంకర్. ఇటీవల ఆయన తెరకెక్కించిన రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయాయి. ఇందులో గేమ్ ఛేంజర్ లాంటి సినిమాలు ఉండడంతో విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడాయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. దాని వివరాలు పంచుకున్నారు. అది భారతదేశం గర్వించే సినిమా అవుతుందన్నారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. లక్ష కాపీలు అమ్ముడైన 'వేల్పారి' అనే నవల గురించి మాట్లాడారు. దీని ఆధారంగా ఆయన తన కలల ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు- తెలిపారు. ఒకప్పుడు నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రోబో'. ఇప్పుడు 'వేల్పారి'. భారీ బడ్జెట్‌తో ఇది రానుంది. ఇప్పటివరకూ చేసిన అతిపెద్ద చిత్రాల్లో ఇది ఒకటి అవుతుంది. దీనికి భారీ స్థాయిలో కాస్ట్యూమ్స్, ఆర్ట్ డిజైన్స్, టెక్నాలజీ అవసరం ఉంది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' వంటి చిత్రాలకు ఉపయోగించిన సాంకేతికను పరిచయం చేయనున్నాను. ప్రపంచమంతా దీన్ని గుర్తిస్తుంది. త్వరలోనే నా కల నిజం కావాలని కోరుకుంటున్నాను' అని శంకర్ తెలిపారు. భారీ అంచనాల నడుమ శంకర్- కమల్‌హాసన్ కాంబోలో తెరకెక్కిన 'ఇండియన్ 2' నిరాశను మిగిల్చింది. దాని తర్వాత రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ ఛేంజర్'ను రూపొందించారు. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దీంతో ఆయన తన తదుపరి ప్రాజెక్ట్ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటు-న్నారు. దీనికోసం కన్నడ హీరో యశ్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు- వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ నిర్మాతలు కూడా ఇందులో భాగం కానున్నట్లు- టాక్ వినిపిస్తోంది.



# పుష్పలో రష్మిక లాంటి రోల్స్ చేయాలని ఉంది

## కన్నడ నటి సప్తమీ గౌడ వెల్లడి

కన్నడ నుంచి టాలీవుడ్‌కి అందాల భామలు వరుసగా ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. సౌందర్య తర్వాత ఆ ట్రెండ్ తగ్గలేదు. నటనతో, గ్లామర్‌తో ఆకట్టుకుంటూ ఇక్కడ తమ సత్తా చాటుతున్నారు. అనుష్క,పూజాహెగ్డే రష్మిక మందన్న లాంటివారు ముందంజలో ఉండగా, పలు కొత్త హీరోయిలు కూడా టాలీవుడ్‌కి అడుగుపెడుతున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ ఇండస్ట్రీ నుంచి పాన్ ఇండియా సినిమాలు వస్తుండటంతో, ఆ చిత్రాల్లో నటించిన హీరోయిన్లకు మిగతా భాషల నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా 'కాంతార' ద్వారా సప్తమీ గౌడ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది.అయితే 'కాంతార' లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ హీరోయిన్ అయినా వరుస సినిమాలతో ధూసుకుపోతారు కానీ.. సప్తమీ మాత్రం 'కాంతార' తర్వాత ఎక్కువ సినిమాల్లో కనిపించలేదు. అయితే దీనికి స్పష్టమైన కారణం ఉన్నట్లు చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ' 'కాంతార' తర్వాత అదే తరహా పాత్రలు నా ముందుకు వచ్చాయి. ముక్కు పుడకలు పెట్టుకోవడం.. గ్రామీణ యువతిగా కనిపించడం.. డైలాగ్స్ లేకపోవడం, సినిమాలో క్యారెక్టర్ సరిగా లేకపోవడం వల్ల నేను సినిమాలు ఒప్పుకోలేదు. మంచి పాత్రల కోసం వెయిట్ చేయడం వల్ల ఎక్కువ సినిమాల్లో నటించలేకపోయాను. మిగతా హీరోయిన్లతో నాకు స్క్రీన్ స్పేస్ లేదు.. ప్రజంట్ తెలుగులో మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్న. పుష్ప మూవీలో రష్మిక మందన్నకు దక్కిన లాంటి రోల్స్ వస్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు.

# విశాఖ రుషికొండ బీచ్ సుందరీకరణపై పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ స్పెషల్ ఫోకస్

మంత్రి కందుల దుర్గేష్ నిశిత పరిశీలనతో పరిశుభ్రంగా దర్శనమిస్తున్న విశాఖ ఆర్ కే బీచ్

ఎప్పటికప్పుడు బీచ్ సుందరీకరణపై ప్రధాన దృష్టి.. అధికారులతో చర్చలు

ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన బీచ్ పై దుష్ప్రచారం తగదని హెచ్చరిక

కలకాలం బ్లూఫ్లాగ్ గుర్తింపు కొనసాగేలా కూటమి ప్రభుత్వం చర్యలు

కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆర్కే బీచ్ లో క్రమంగా పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య



అమరావతి(విజయ సారథి):రాష్ట్రంలో ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన విశాఖపట్నంలోని రుషికొండ బీచ్ పై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టిసారించారు. కలకాలం బ్లూఫ్లాగ్ గుర్తింపు కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇవే గాక రాష్ట్రంలో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ బీచ్ క్లీన్ గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పర్యాటకులు అధికంగా వచ్చే ఆర్ కే బీచ్ లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత, భద్రత, పర్యావరణ నిర్వహణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రే వాటర్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. బీచ్ లో సుందరీకరణకు పెద్దపీట వేయాలని ఇప్పటికే పర్యాటక శాఖ తరపున రూ.24 లక్షలు కేటాయించిన విషయం విదితమే.మంత్రి కందుల దుర్గేష్ ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ నిత్యం బీచ్ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణ, మురుగు సముద్రంలోకి వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో పర్యాటకులకు సైతం తాము తాగి పడేసిన బాటిళ్లు, తిని పడేసిన ప్లేట్లు డస్ట్ బిన్ లో వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ క్షేత్రస్థాయి సందర్శన కోసం విశాఖ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్, జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విశాఖలోని నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓషియనోగ్రఫీ సీనియర్ సైంటిస్ట్, రూరల్ వాటర్ సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ 2, జీవీఎంసీ జోనల్ కమిషనర్ 3, ప్లాటిపస్ ఎస్కేప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, లెవిన్ అడ్వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ లతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. బీచ్ తీర ప్రాంతంలో తరుచూ సముద్రపు వ్యర్థాలు, మురుగు సముద్రంలో కలవకుండా నాలా అవుట్ ఫాల్స్ ను గుర్తించి తొలగింపుకు తగు చర్యలు తీసుకునేందుకు కమిటీ పనిచేస్తోంది. చెత్త ఒడ్డుకు చేరకుండా నిరోధించేందుకు యంత్రాలు ఏర్పాటు చేసి తద్వారా బీచ్ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా దీర్ఘకాలిక పరిష్కారానికి కమిటీ శ్రమిస్తుంది. అదే విధంగా బీచ్‌లో పర్యాటక సందడి పెరగడానికి మంత్రి దుర్గేష్ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాక విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు, నగరవాసులకు డబుల్ డెక్కర్ బస్సుల్లో నగర విహారం చేసేలా అనుభూతి భరితమైన, పర్యావరణహితమైన ప్రయాణాన్ని అందించారు. పర్యాటకులు కేవలం బీచ్‌ల సందర్శనకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలను సందర్శించేలా టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరగడం విశేషం. ఈ విషయంలో పర్యాటక శాఖతో పాటు వివిధ శాఖల అధికారుల కృషి ప్రశంసనీయం. మరోవైపు ఎప్పటికప్పుడు జిల్లాల పర్యాటక శాఖ అధికారులతో టూరిజం శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి కాటలు సమీక్షలు నిర్వహించి విలువైన మార్గదర్శకత్వం అందిస్తూ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు.భారతదేశంలో కేవలం ఎనిమిది బీచ్‌లకు మాత్రమే బ్లూఫ్లాగ్ గుర్తింపు ఉంటే అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ రుషికొండ బీచ్ ఒకటి. ప్రఖ్యాత డెన్మార్క్ కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ ఈఈ) సంస్థ ఈ గుర్తింపు అందించింది. ప్రతిష్టాత్మక బీచ్ పై కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ రాష్ట్ర ఖ్యాతిని పాడు చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి బ్లూఫ్లాగ్ గుర్తింపు తాత్కాలిక రద్దవడంతో మంత్రి దుర్గేష్ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బీచ్ లో మళ్లీ పర్యావరణ సంరక్షణ మెరుగుపడేలా చర్యలు తీసుకొని గుర్తింపు తిరిగి దక్కేలా చొరవ చూపారు. అనంతరం బీచ్ ను స్వయంగా సందర్శించి స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులతో చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో కొందరు పాత ఫోటోలు జత చేసి బీచ్ లో పరిశుభ్రత లోపించిందన్న సందేశాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంత మాత్రం సరికాదని భావించాలి. రాష్ట్ర బీచ్ పర్యాటకాన్ని బాగు చేసేందుకు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇచ్చి పర్యాటకాంధ్రప్రదేశ్ కు బాటలు వేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తుంగభద్ర నదిలో స్నానాలు నిషేధం: మంత్రాలయం సీఐ



మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం తుంగభద్ర నదిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నదిలో పుణ్యస్నానాలు నిషేధించినట్లు మంత్రాలయం సీఐ రామానుజులు తెలిపారు. మండల అధికారులు ఏర్పాటు చేసిన షవర్ల వద్దే భక్తులు స్నానాలు ఆచరించాలని సూచించారు. రెండు రోజుల క్రితం నదిలో కర్ణాటకకు చెందిన ముగ్గురు యువకుల మృతి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తులు పోలీస్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## శ్రీ మఠంలో టీకాచార్యుల ఆరాధన మహోత్సవం



మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం శ్రీ మఠంలో రాఘవేంద్ర స్వాముల వారి గురువులు అయినటువంటి టీకాచార్యుల ఆరాధన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీకా చార్యుల చిత్రపటాన్ని బంగారు రథోత్సవంపై ఉంచి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మంగళ వాయిద్యాలు అశేష జనవాహిని నడుమ ఊరేగించారు. డోలోత్సవ మంటపంలో పండితులు టీకాచార్యుల మహిమను భక్తులకు వివరించారు. పీఠాధిపతి మూలరాముల పూజలు చేసి, భక్తులను ఆశీర్వదించారు.

## ప్రహల్లాదుడికి పాదపూజ

మంత్రాలయం(విజయ సారథి):శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రహ్లాద మూర్తికి అర్చకులు మంగళవారం పాదపూజ నిర్వహించారు. ఉంజల్ మంటపంలో సేవాకర్తల పేరుమీద సామూహిక సంకల్పాలు చేశారు. అనంతరం ఉత్సవ రాయల పాదపూజ, సర్వసేవ, తులసి అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మృతిక బృందావనాన్ని వెండి ఉయ్యాలలో ఉంచి పూజలు చేశారు. అంతకుముందు మూల బృందావనానికి అభిషేకాలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. శ్రీ మఠం సహాయ పీఆర్‌ఓ వ్యాసరాజస్వామి ఉన్నారు.



## ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి.:రాష్ట్ర మంత్రి టి.జి భరత్.

లక్ష్మీ నగర్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేసిన మంచిని వివరించిన మంత్రి టి.జి భరత్

కర్నూలు(విజయ సారథి):ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 24వ వార్డు లక్ష్మీ నగర్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఏ ఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. ఏడాది కాలంలో మీకు ఎమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగారు. అనంతరం మంత్రితో స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తమకు అందుతున్నాయని బదులిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం పథకాలు తమకు



వర్తించినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా వార్డులో పేరుకుపోయిన సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి టి.జి భరత్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఎన్నికల సమయంలో మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ ఇస్తున్నామని, తల్లికి వందనం, అన్నా క్యాంటిన్ల వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు భారీగా వస్తున్నాయన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు.సీఎం చంద్రబాబు నాయుడు వయస్సుని ఉద్దేశించి వైఎస్‌ఆర్సీపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు వైఎస్‌ఆర్సీపి నేతలు తప్ప మరెవరు చేయరన్నారు. ఇప్పటికే ప్రజలు వీరికి 11 సీట్లు ఇచ్చారని.. ఇలాంటి వైఖరి కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో అవి కూడా దక్కవన్నారు.

## రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

మంత్రాలయం(విజయ సారథి):బైపాస్ రహదారి రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే లబ్ధిదారులకు, రైతులకు పరిహారం పంపిణీలో న్యాయం చేస్తామని మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే రైతులు, లబ్ధిదారులతో నష్ట పరిహారంపై రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. అలాగే లబ్ధిదారులతో నష్ట పరిహారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయే రైతులు సహకరించాలని కోరారు. రైతులకు, లబ్ధిదారులకు నష్టం జరగకుండా పరిహారం ప్రభుత్వం నుండి అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులు అడిగిన పరిహారంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు డిప్యూటీ తహసీల్దార్ గురురాజిరావు, ఆర్ ఐ జనార్దన్ రావు, వీఆర్వోలు భీమన్న గౌడు భీమయ్య ఉన్నారు



## హెచ్ ఎన్ ఎస్ ఎస్ నీటి విడుదలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల(విజయ సారథి):ఈనెల 17వ తేదీ జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తయిన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్న సందర్భంగా ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హెచ్ ఎం ఎస్ ఎస్ కాలువకు నీటిని విడుదల చేయు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి .రాజకుమారి మాట్లాడుతూ....హెచ్ ఎన్ ఎస్ ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి విడుదల చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. నీటి విడుదల కార్యక్రమానికి సంబంధించి మంత్రులు ఎమ్మెల్యేలు



ప్రజాప్రతినిధులు వచ్చే అవకాశం ఉన్నందున సభా వేదిక నందు రైతులకు సీటింగ్, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. బహిరంగ సభ వద్ద రైతులు ఎటువంటి తోపులాటలు జరగకుండా అవసరమైన ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ... గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా నీటి విడుదల చేసే కార్యక్రమాలకు సంబంధించి రైతులు నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం గ్రామంలో పొలం పిలుస్తుంది



కాకినాడ(విజయ సారథి):కిర్లంపూడి మండలం రామచంద్రపురం మంగళవారం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కిర్లంపూడిఏవో సుధా మాధురి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధా మాధురి మాట్లాడుతూ సార్వ సీజన్ మొదలైంది కావున రైతులందరూ దమ్ములు చేపట్టి నారు మడులు వేసుకోవాల్సిందిగా రైతులకు సూచించడం జరిగింది .అలాగే రైతులు విత్తనాలు విత్తేముందు విత్తన శుద్ధి పాటించాలని, కౌలు రైతులు తప్పకుండా కౌలు కార్డులు తీసుకోవాలని మరియు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలనిరైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ వ్యవసాయ సహాయకులు పాఠంశెట్టి హరికృష్ణ, పి.వెంకటలక్ష్మి మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## శాకంబరీగా పెద్దాపురం మరిడమ్మ దర్శనం

.పెద్దాపురం(విజయ సారథి):పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న మరిడమ్మ తల్లి దేవస్థానంలోఆషాడ మాసం పురస్కరించుకొని మంగళవారం శాకంబరి దేవిగా మరిడమ్మ తల్లి దర్శనం ఇవ్వడంతో భక్తులు పులకింతలు అయ్యారు. ఆషాడ మాసం వేడుకల్లో భాగంగా పకృతిసిద్ధంగా లభించే కూరగాయలతో ఆకులు పత్రాలతో దేవస్థానం ఈవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో శాఖంబరిగాలంకరించారు. దేవస్థానం అర్చకులువిజయ,శంకర శాస్త్రి తదితరపురోహితులు పూజలు నిర్వహించారు. ఆషాడంలో అలంకృతమైన అమ్మవారి దర్శించడం సుప్రధమని తెలిపారు. ఆలయ ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆషాడ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో విజయలక్ష్మి తెలిపారు.



## ఏపీ ఎంఎఫ్ తిరుపతి ఉపాధ్యక్షుడు జయ కుమార్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన తిరుపతి ప్రెస్ క్లబ్ కార్య వర్గం

తిరుపతి(విజయ సారథి):ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి ఉపాధ్యక్షులు జయ కుమార్ జన్మదిన వేడుకలు. స్థానిక తిరుపతి ప్రెస్ క్లబ్లో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కలుపల్లి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ వార్త రిపోర్టర్ జయశంకర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుతూ తిరుచానూరు అమ్మవారి దీవెనలు నిండు నూరేళు ఉండాలని కోరుతున్నాను అని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివమూర్తి శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీ ఎంఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ జి ముని చంద్రారెడ్డి, నాగరాజు ,తనుస్క జ్యూలరీ ఎండి త్యాగరాజ్ జయశంకర్ ను శాలువాతో సన్మానం చేసి తమ సిబ్బందితో కేక్ కట్ చేసి జయశంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# కమిషనర్ ని కలిసిన ఐఎన్ టియుసి నాయకులు



కర్నూలు(విజయ సారథి):కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ని మంగళవారం ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఆధ్వర్యంలో కలవడం జరిగింది. బతుకన్న మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ని ఐఎన్టియుసి యూనియన్ వీధి దీపాలు మరమ్మతులు చేసే నగరపాలక కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిసి వారి యొక్క సమస్యల కోసము మున్సిపల్ కమిషనర్ ని కలవడం జరిగిందని దీనికి గాను మున్సిపల్ కమిషనర్ మీ సమస్యలు నేను చర్చించి, మీ జీతాల విషయం తెలుసుకూని నాలుగు నెలలు జీతాలు ఎందుకు ఇవ్వడం లేదు అనే దాని గురించి తెలుసుకొని చెబుతా అని అన్నారు. దీనికి గాను ఎంప్లాయిస్ అంతా సంతోష పడుతూ మా న్యాయమైన కోరికలు త్వరలోనే పరిష్కరించండి అని కమిషనర్ కి విన్నవించుకోవడం జరిగింది. కమిషనర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షుడు ఆర్ ప్రతాప్, మున్సిపాల్ ఎంప్లాయిస్ తరఫున ఆర్ సురేష్ మొదలగు కార్మికులు కలవడం జరిగింది.

# వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న చర్యలు తీసుకుంటున్నాం

మెదటిపేజీ తరువాయి...

పేరు మార్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించగా పేరు మారిస్తే ఇబ్బందులు రావొచ్చని, ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.అనంతరం స్థానిక ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ మానసిక వైద్యంలో మరింత నాణ్యత పెరగాల్సి ఉందని, వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా సేవలు మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఫలితాలపై పునరాలోచించుకొని ముందుకెళ్లాలని హితవు పలికారు. సైకాలజీ, సైకయాట్రిస్టుల సంఖ్య పెరగాల్సి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. డి. అడిక్షన్ సెంటర్ల సేవలను మరింత విస్తృతం చేయాల్సి ఉందని, ఇంకా ఏం చేయాలో ఆలోచించి సేవలను విస్తరించాల్సి ఉందని అన్నారు.ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మెంటల్ కేర్ ఆసుపత్రి పేరును మారిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. న్యూరో సైన్స్ అండ్ రీసెర్స్ సెంటర్ అనే నామకరణంపై ఆలోచించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రసంగంలో భాగంగా సత్యకుమార్ చాలా శక్తిమంతుడని, ఎలాంటి పనైనా సులభంగా చేయగలరని, నిధులు తేగలరని మంత్రిని ఉద్దేశించి పేర్కొన్నారు.దేశ సంపన్నత నాణ్యమైన మానవ వనురుల రూపంలోనే ఉంటుందని, ఆ ప్రక్రియలో మానసిక వైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్సీ, విప్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. వైద్య వృత్తి దైవ సమానమని, అందులోనూ మానసిక రుగ్మత కలిగిన రోగులకు సేవ చేయటం మరింత ఉన్నతమైనదని కొనియాడారు. ఈ రంగంలోని గురువులు విద్యార్థుల పట్ల కాస్త కఠినంగా ఉండాలని, అప్పుడే నాణ్యమైన భావితర వైద్యులు అందుబాటులోకి వస్తారని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికైనా, ఏమైనా మానసిక సమస్యలుంటే ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా త్వరితగతిన స్పందించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఇలాంటి వారి కోసమే భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయిలోని విద్యార్థులు చిన్నపాటి మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు.. వారంతా మానసిక వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఉద్యోగులు కూడా మానసికమైన సమస్యలతో బాధతపడుతున్నారని, సమన్వయం చేసుకోవటంలో విఫలమవుతున్నారని గుర్తు చేశారు. జిల్లాలో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు గాను ఆధునిక వసతులను సమకూరుస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయనతో పాటు స్థానిక ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎన్.టి.ఆర్. వైద్య సేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ డా. వెంకటేశ్వరరావు, మెంటల్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె.వి. రామిరెడ్డి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి, డీఎం,హెచ్వో పి. జగదీశ్వరరావు, స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యమయ్యారు.

# యువత నైపుణ్యం పెంచుకోవాలి

## కేజీబీవీ ప్రిన్సిపల్ శాంతి

.మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం మండలం చిలకలడోణ కేజీబీవీలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ శాంతి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి యువశక్తిపై ఆధారపడి ఉందని, నేటి యువత



రేపటి సమాజానికి దారిదీపమ వుతారని పేర్కొన్నారు. యువత విలాస వంత జీవితానికి కాకుండా, నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కంప్యూటర్ ఫ్యాకల్టీ స్వప్న మాట్లాడుతూ నైపుణ్యం వల్లే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు.

# మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి

## ఈనెల 19వ తేదీన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి

## వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం(విజయ సారథి):జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4, తదితర అంశాలపై డ్వామా పిడి, జడ్పి సిఈఓ, డిపిఓ, ఆర్డీఓలు, డిఎల్డిఓలు, డిఎల్పీఓలు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీరో పావర్టీ పీ4 కార్యక్రమం కింద జిల్లాలో 54 వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందని, ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతిరోజు 3,000 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చూడాలని, ప్రతి మండలం నుంచి 100 మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను ప్రతిరోజూ దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు, వ్యాపారవేత్తలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు.జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలలో భాగంగా తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హోల్డ్ పెండింగ్ వెంటనే 24 గంటల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ కు సంబంధించి కంబదూరు మండలంలో 57 శాతం మాత్రమే ఉందని, అన్ని చోట్ల ఉద్యోగుల అటెండెన్స్ పూర్తిగా వంద శాతం నమోదయ్యేలా పురోగతి తీసుకురావాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్ రిక్వెస్ట్ లను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లాకు అవార్డులు వచ్చేలా కృషి చేయాలని, గ్రామాలు స్వచ్ఛంగా కనబడేలా చూడాలన్నారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్డబ్ల్యూపిసి షెడ్లను అన్ని చోట్ల పనిచేసేలా చూడాలన్నారు.ఈనెల 19వ తేదీన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి.ఈనెల 19వ తేదీన ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూలై నెల "అంతం – ప్లాస్టిక్ కాలుష్యం" అనవసరమైన ప్లాస్టిక్‌లు మరియు సంబంధిత కాలుష్యాన్ని నివారించాలనే థీమ్ తో వచ్చే శనివారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం వేయించాలని మరియు ప్రకటనలు చేయించి శనివారం రోజున ఏఏ కార్యక్రమాలు ఏ ప్రదేశాలలో జరుగుతాయో తెలియజేసి అందరూ ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నివారించడం వంటి పనులు చేయాలన్నారు. ఐఈసి యాక్టివిటీలను మండల, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని, ఆరోజు క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిపిఓ నాగరాజునాయుడు, సిపిఓ ఆశోక్ కుమార్, జడ్పి సిఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరెకటిక సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

## అధ్యక్షులు కళ్యాణకారి రానోజి రావు

## మంత్రాలయం తాలుకా ఆరెకటిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం నియోజకవర్గంలో ఆరెకటిక సంఘం సభ్యులు, సోదరుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రాలయం తాలూక ఆరెకటిక సంఘం అధ్యక్షులు కళ్యాణ కారి రానోజి రావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రైవేటు వసతి గృహంలో నూతనంగా మంత్రాలయం తాలూక ఆరెకటిక సంఘం ఏర్పాటు చేయడం జరిగింది.



సంఘం గౌరవ సలహా దారులు రాంపురం కళ్యాణకారి సోమోజిరావు, గౌరవ అధ్యక్షులు కళ్యాణకారి నరసింహా రావు, అధ్యక్షులు కళ్యాణకారి రానోజి రావు, ఉపాధ్యక్షులు కళ్యాణకారి భీమోజీ రావు, కళ్యాణకారి భర్మోజీ రావు, ప్రధాన కార్యదర్శి నిజంకారి బందోజీ రావు, ఉప కార్యదర్శి కళ్యాణకారి నరేష్ రావు, కోశాధికారి కళ్యాణకారి హుసేంజీ రావు, కళ్యాణకారి ఖాసీంజీరావు, కళ్యాణకారి తులసి రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా కళ్యాణకారి సురేష్ రావు, కళ్యాణకారి రవి రావు, చాకడోణ నిజంకారి రాఘవేంద్ర రావు, అరగిద్ద ధర్మకారి ఈరన్న,కళ్యాణకారి ఈరన్న, కళ్యాణకారి హరి, కళ్యాణకారి సుందర్ రావు, కళ్యాణకారి శివ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆరెకటిక సంఘానికి ప్రధాన మూలాలైన సభ్యులుగా కళ్యాణకారి హుసేని, కళ్యాణకారి ఏకే రాఘవేంద్ర, కళ్యాణకారి చిన్న సురేష్, ఎరిగేర దోణకారి మహేష్, కె. భీమ, కళ్యాణకారి చిన్న భీమోజీ లను ఎన్నుకున్నారు. అనంతరం ఆరెకటిక కుల బంధువులు కమిటీ సభ్యులందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరెకటిక సంఘం సభ్యులు, కుల బంధువులు పాల్గొన్నారు.

# రాయులసీమ జర్నలిస్ట్ ఫోరం నూతన రాష్ట్ర కమిటీ ఏర్పాటు

## సభ్యులకు 10 లక్షలు ఇన్సూరెన్స్

## జర్నలిస్టు మరణిస్తే కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులు కింద 5 వేలు ఆర్థిక సాయం

కర్నూలు(విజయ సారథి):జర్నలిస్టుల హక్కుల కోసం, జర్నలిస్ట్ సంక్షేమం కోసం రాయలసీమ జర్నలిస్ట్ ఫోరం నిరంతరం పోరాటం చేస్తుందని రాయలసీమ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిన నవీన్, సిరిపిరెడ్డి చంద్రశేఖరరెడ్డి లు తెలిపారు. కర్నూలు నగరంలోని రాయలసీమ జర్నలిస్ట్ ఫోరం కార్యాలయంలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో ఏకగ్రీవంగా మరోసారి బత్తిన నవీన్, సిరిపిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి లను రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. తమను మరోసారి ఎన్నుకున్నందుకు కమిటీ




సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు ముందుంటామని అన్నారు. ఏదైనా జర్నలిస్టులకు విధి నిర్వహణలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చినట్లయితే అందుకు సంబంధించిన వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్లు స్థలము కేటాయించి,అందులో డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్రెడిటేషన్ రెన్యువల్ కాకుండా నూతన అక్రెడిటేషన్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఎవరైనా మరణిస్తే మట్టి ఖర్చులు గాను వారి కుటుంబ సభ్యులకు రాయలసీమ జర్నలిస్టు ఫోరం తరపున 5000 రూపాయలు ఇస్తామని ప్రకటించారు. రాయలసీమ జర్నలిస్టు ఫోరంలో మెంబర్షిప్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు పది లక్షల రూపాయలు పోస్టాఫీసు ఇన్సూరెన్స్ ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు ఈ సందర్భంగా అన్నారు. 60 సంవత్సరాలు దాటిన సీనియర్ జర్నలిస్టులకు ప్రతి నెలా 10 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అబిద్ బాషా, రాష్ట్ర కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా పి.వెంకటేశ్వర్లు,జి.హుస్సేన్, రాష్ట్ర ట్రెజరర్ గా సర్దార్ బాషా, రాష్ట్ర మీడియా కన్వీనర్ గా ఈశ్వర్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా పి.సుధాకర్ రెడ్డి, కె.శివ, టి.శ్రీనివాసులు ఎన్నికైనారు.

# అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పై అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలి

## బుద్ధు ని తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

## ఈనెల 28న మదనపల్లిలో దక్షిణాది రాష్ట్రాల ఇండియా కూటమి నాయకులతో జైల్ భరో నిర్వహిస్తాం

## చిత్తూరు జిల్లా ప్రజా సంఘాలు పిలుపు

చిత్తూరు(విజయ సారథి):తథాగతుడు గౌతమ బుద్ధుని తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి నిందితులపై దేశ ద్రోహం నమోదు చేసి,కుల వివక్షతో బౌద్ధులను అవమానించి – దురుసు ప్రవర్తనతో దళిత నేతల్ని గాయపరచి , బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన చిత్తూరు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆయనను సస్పెండ్ చేయాలని చిత్తూరు జిల్లా ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు జిల్లా కేంద్రం కుప్పం పట్టణంలో సుజ్ఞానానంద మీటింగ్ హాలులో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి యం.బాలకృష్ణ అధ్యక్షతన పలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో దళిత నాయకులు దేవరాజు మాదిగ, దళిత నాయకులు బాలచంద్రబాబు,రాష్ట్ర , బంజారాసేవాసంగ్ జిల్లా అధ్యక్షులు రవి నాయక్ , సిపిఎం సీనియర్ నాయకులు శివశంకర్,పలమనేరు బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాసులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కంద స్వామి, ఆర్ పీ ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్, అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో ఉన్న బుద్ధుని కొండపై ఇటీవల గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాద ఉద్ఘటనపై సకాలంలో మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ నిర్వాహకుల ఫిర్యాదు స్వీకరించకుండా కేసును నీరుగాచేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ పిటీఎం శివప్రసాద్ మరియు బౌద్ధులు శాంతియుతంగా దమ్మ దీక్ష చేస్తుండడంతో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అప్రజాస్వామికంగా వ్యవహరించి బుద్ధుని తల నరికి, తల –మొండెం వేరు చేసిన మతోన్మాదుల్ని గుర్తించి, అరెస్టు చేయడం పక్కన పెట్టి, బుద్ధుని తల నరికిన ఉన్మాదంపై నరోడ్డుకు సంబంధం లేకుండా శాంతియుతంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడానికి పెద్ద సంఖ్యలో పోలీసులను పంపించడాన్నీ వీరు తప్పు పట్టారు . దీక్షకు నాయకత్వం వహించిన బౌద్ధ ఉపాసకులు పీటీయం శివప్రసాద్ ను వెంటనే అరెస్టు చేసి, దీక్ష శిభిరం ధ్వంసం చెయ్యమని ఆదేశాలు ఇవ్వడం దీంతో రెచ్చిపోయిన పోలీసులు శివప్రసాద్ గారిని రిక్వెస్ట్ మీద వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఎస్పై ఛాంబర్ లో నిర్బంధించి శివప్రసాద్ పట్ల దురుసుగా ప్రవర్తించగా ఆయన అస్వస్థతకు లోనై గుండెపోటు రావడంతో కనికరం కూడా లేకుండా వారిపై ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య అని వీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పిటిఎం శివప్రసాద్ కోలార్ ఆసుపత్రి లో హార్ట్ సర్జరీ చేసుకున్నారు.శివ ప్రసాద్ అనారోగ్య సమస్యకు పోలీసు డిపార్ట్మెంట్ నైతిక బాధ్యత వహించి ప్రజా ఉద్యమకారులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని వీరు కోరారు. అన్నమయ్య జిల్లాలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పౌర హక్కుల్ని గాలికొదిలేసి, తన సొంత రాజ్యాంగం అమలు చేస్తున్నారని ,ఏ జిల్లాలోనూ లేని అప్రజాస్వామిక విధానాలు ఇక్కడ అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుండడంతో ఎస్పీ అమలు చేస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నించినందుకు దళితులపై ఆయన ఆగ్రహం పెంచుకొని , బౌద్ధ విశ్వాసులపై స్థానిక పోలీసుల ద్వారా తప్పుడు కేసులు కట్టించి భౌతికంగా హింసించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పై అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. భారతీయ అంబేద్కర్ రాష్ట్ర అధ్యక్షులు ఈనెల 28వ తేదీన మదనపల్లి పట్టణంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షులు పార్లమెంట్ సభ్యులు తోల్ తిరుమా వలవన్ తో పాటు తెలంగాణ ,కర్ణాటక ,తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఇండియా కూటమి మంత్రులు, ఎంపీలు హాజరవుతున్నారని కావున జిల్లాలోని ప్రజాస్వామిక వాదులు , బహుజన వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు . ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర నాయకులు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ కుప్పం మండలం అధ్యక్షులు మన స్వామి, స్వేరో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగార్జున, బాస్ జిల్లా నాయకులు వినోద్, జిల్లా నాయకులు శంకరప్ప, నియోజకవర్గ నాయకులు ఎల్లప్ప, పలమనేరు నియోజకవర్గం నాయకులు గోపి, మండల నాయకులు సురేష్, నాగభూషణం, పలమనేరు వైసిపి యూత్ నాయకులు కిషోర్, చంద్రప్ప, తిమ్మరాజులు, మంజు, ప్రజా సంఘాలు అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com